కత్తి విసిరిన కన్య

సికిందర్

"వాడ్నలా వూరికే వదలను. పొడిచి చంపుతాను"

అంది రాగిణి పిడికిలి బిగించి ఆవేశంగా. ఆమె కళ్ళు ఎర్రబడి, వొళ్లు కంపించిపోతోంది.

అనిత దిండులోంచి కంగారుగా తలెత్తి చూసింది, వర్షిస్తున్న కళ్ళతో.

"నువ్వలా పిచ్చిగా మాట్లాడకు" వారించిందామె, పూడుకుపోయిన స్వరంతో, ముంచుకొస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"వాడ్ని చంపి వదులుతానంతే!" కచ్చితంగా చెప్పేసింది రాగిణి, అదే వుద్రేకంతో.

అనిత తటాలున కూర్చుని ఆమెని పట్టుకుంది. "రాగిణీ! నువ్వలా మాట్లాడకే!...."

రాగిణి ఆమెని విడిపించుకొని దూరంగా జరిగింది. "వాడ్ని చంపుతానక్కా! కసిగా చంపిగానీ వదలను."

"నోర్మూయ్! పిచ్చిగా వాగుతున్నావ్. వెళ్ళి వంట

సంగతి చూడు!"

"అంటే!....అయితే వాడన్నలా వూరికే వదిలేయడమేనా? వాడిచేత అంతమాట పడి నువ్వు—నువ్వింకా ఎలా తలెత్తుకుంటావ్? సిగ్గు విడిచి మళ్ళీ ఆఫీసు కెళతావా లేక ఇంట్లో కూర్చుని ఇలా ఏడుస్తూ...."

"నువ్వెళ్ళు ఇక్కడ్నించి!" అనిత కేక పెట్టింది.

"నువ్వు త్త వెర్రిదానివక్కా! నేనయితే ఏం చేసేదాన్నో తెలుసా? ఆ మాట అన్నప్పుడే చెప్పుతో పళ్ళు వూడగొట్టి, మరో చెప్పుతో దవడ పగలగొట్టేదాన్ని."

"నీకు పిచ్చి పట్టింది! వెళ్ళిక్కడ్నించి."

"వెర్రి మొఖానివి! నీకేం తెలుసు? పేద్ద సంపాదించేదానిలా బయలుదేరి వచ్చావు—మా మాట వినకుండా, మమ్మల్ని లక్ష్యపెట్టకుండా! నీ గురించి నాన్న ఎంత బెంగపడుతున్నాడు! శుద్ధ అమాయకురాలివి, ఇంత పెద్ద వూళ్ళో ఎలా వున్నావో, ఏమయిపోతున్నావోనని! అక్కడ ఇంటి దగ్గరే ఎవరయినా ఆకతాయి వేళాకోళం చేస్తే భోరుమని ఏడ్చేదానివి—ఇక్కడ ఈ హైద్రాబాదులో ఎలా వుండగలననుకుంటున్నావు? పేద్ద మమ్మల్ని వుద్ధరించేదానిలా బయలుదేరి వచ్చావు! సంపాదించాలన్న పట్టుదల వుంటే పౌరుషం కూడా వుండాలి. ఛ—నీ చెల్లెల్నని చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నాను."

"నిన్నిక్కడి కెవడు రమ్మన్నాడు? నా ఏడుపేదో నే నేడుస్తాను."

"ఆ ఏడుపేదో నువ్వే యేడ్వక నాతో యెందుకు చెప్పావు? చెప్పాక నేనూరుకుంటానని యెలా అనుకున్నావు? నా సంగతి నీకు తెలియదా? ఇలాంటివి సహిస్తానా? నేనంటే అందరికీ హడల్! రోమియోలంతా

బలాదూర్! తెలియదూ, మనూళ్ళో నేనెలా చెలామణి అవుతానో! నాకు సెలవులు కాబట్టి, ఇక్కడికొచ్చాను కాబట్టి సరిపోయింది. లేకపోతే నువ్విక్కడ జరిగే అన్యాయాలకి గురై — లేదు, వాడ్నలా వదలకూడదు. చెప్పు, వాడెక్కడుంటాడు? కమాన్!"

"నువ్వూరుకో రాగిణీ! అలా వుద్రేక పడకు. నేనక్కడ పని మానేసి వేరేచోట చూసుకుంటాను."

"వాడెక్కడుంటాడు?" రెట్టించింది రాగిణి.

"నీ కెందుకు? ఏం చేస్తావు?"

"సరే, నువ్వు చెప్పవు. నేనే తెలుసుకుంటాను. వాడి పేరు, ఆఫీసు పేరూ నాకు తెలుసు. నువ్విక్కడే వుండు, నే నిప్పుడే వస్తాను."

అనిత తటాలున ఆమెని పట్టుకుంది.

"వెళ్ళకు! నువ్వక్కడికి కెళ్ళకే రాగిణీ!"

రాగిణి ఉద్రేకంతో ఒక్క కేక పెట్టి ఆమెని వెనక్కి నెట్టేసింది.

"వాడికి నా తడాఖా తెలియాలి. నీకు నిప్పులాంటి చెల్లెలుందని తెలిస్తే నీ జోలికి యెవరూ రారెప్పుడూ."

రాగిణి వేగంగా వెళ్ళి తలుపు తీసింది. అనిత మళ్ళీ వెనుక నుంచి పట్టుకుంది. "నువ్వేం చేయబోతున్నావిప్పుడు?"

రాగిణి నవ్వింది జాలిగా. "అక్కా, నువ్వెందుకలా తప్పు చేసినదానిలా భయపడ్తావు? భయపడి కాళ్ళబేరానికి రావల్సింది వాడు!"

ఆమె చటుక్కున బయటకి దూకి, తలుపు లాగి గొళ్ళెం పెట్టేసింది.

లోపల నుంచి అనిత అరుస్తున్నా, వారిస్తున్నా

వినిపించుకోకుండా వెళ్ళిపోయింది— రోడ్డెక్కి రిక్షా ఎక్కేసింది.

"దగ్గరలో హోటల్ వుందా?"

"ఉందండి."

"ఎక్కడ?"

"క్రాస్ రోడ్స్‌లో, రహాత్ మహల్ దగ్గర."

"ఆ హోటల్లో ఫోన్ వుందా?"

"వుందండి."

"అక్కడికి పోనివ్వు త్వరగా."

రాగిణి ఎడమ చేతికి వాచీలో నిమిషాలు లెక్క పెట్టింది. సరిగ్గా ఏడు నిమిషాల ఇరవై సెకన్లకి హోటల్ చేరుకుంది రిక్షా. ఆమె దిగి డబ్బులిచ్చి వేగంగా ఎదురుగా ఇరానీ కేఫ్‌లో కెళ్ళింది. కౌంటర్‌లో మనిషి నవ్వుతూ చూశాడు.

"ఫోన్ ఉపయోగించవచ్చా?"

"సంతోషంగా."

"డిక్షనరీ వుందా?"

"పారబడ్డారు, డైరెక్టరీ అడగండి."

"ఏదో ఒకటి ఇలా పారేయండి, నేను తొందరలో వున్నాను."

డైరెక్టరీ అందుకొని ఆమె, "ఇక మీరవతల బిల్స్ తీసుకోండి!" అంది.

ఆమె ముఖంలో వుద్రేకం, ఆవేశం చూసి అతను, "బహెన్ జీ, బాత్ క్యా హై?" అన్నాడు.

"తుమ్ కైసా చెప్తా హై? కామ్ దేఖో నీది!" కసిరిందామె గబగబా పేజీలు తిరగేస్తూ. ఒకచోట ఆగిపోయి ఒక నెంబర్ ఎన్నుకొని డయల్ చేసింది. కానీ రెస్పాన్స్

లేకపోవడంతో మళ్ళీ పేజీలు తిప్పి మరో నంబర్ డయల్ చేసింది.

అప్పుడు సమాధానం వచ్చింది: "హాలో, ఎవరూ?"

"మిస్టర్ మహేంద్రనాథ్! ఇతరులకి మానర్స్ నేర్పే ముందు నీ హక్కేమిటో, ఔచిత్య మేమిటో ఆలోచించాలి. అసలు నీకు మానర్స్ వుందా? ఉంటే మా అక్కయ్యను హోటల్‌కు రమ్మంటావా? అక్కడా మెకి పదతులు నేర్పుతావా? ఆమె అమాయకతను చూసి ఎర వేస్తావా? నీచుడా! నీ ఎర నీ మెడకు ఉరి అయేలా చూస్తాను!"

"హలో, ఎవరది?"

"నీ అక్కౌంటెంట్ అనిత చెల్లెల్ని."

"ఓహ్ అలాగా.... నువ్వు పొరబడ్డావమ్మాయ్.... తప్పుగా మాట్లాడుతున్నావ్."

"నోర్మూయ్! అరగంటలోగా వచ్చి అక్కయ్యకు క్షమాపణ చెప్పుకోకపోతే నువ్విక బ్రతకవ్."

"షటప్! ఆమెని నేనేమీ చేయలేదు."

"ఆమెని నీ మాటలతో అవమానించావు. క్షమాపణ చెప్పుకుతీరాలి. అరగంటలోగా ఇంటికి రాకపోతే నీకు చావు ఖాయం. వింటున్నావా? నీకు చావు తథ్యం! బాగా గుర్తుంచుకో."

రిసీవర్ తక్కున పెట్టేసి "ఎంతివ్వాలి?" అనడిగిందామె.

ప్రొప్రయిటర్ అయోమయంగా చూశాడు. "హమ్ పైసా నై లేతా, బహెన్‌జీ!"

"అయితే కైసా జీతాజీ?" అర్చిందామె సహనం కోల్పోయి, అక్కడ నుంచి కదిలి వేగంగా వెళ్ళిపోతూ.

2

ట్విన్ సిటీస్ డిటెక్టివ్ ఏజెన్సీ ఆఫీసులోకి ఒక అజానుబాహుడు ప్రవేశించి చొరవగా కరచాలనం చేస్తూ, "గుడ్ మార్నింగ్ మిస్టర్ లాల్. గుడ్ మార్నింగ్ మిస్టర్ జాన్, గుడ్ మార్నింగ్, గుడ్ మార్నింగ్. హౌ ఆర్యూ?" అన్నాడు నవ్వుతూ.

డిటెక్టివ్ లు అర్థంగాక ముఖాలు చూసుకున్నారు.

"ఫైన్, ప్లీజ్ సిట్డవున్" అన్నాడు లాల్.

"థాంక్స్. మీతో చాలా ముఖ్యమయిన విషయం మాట్లాడాలి!" అన్నాడతను కూర్చుంటూ, "నా పేరు మహేంద్రనాథ్, జూబ్లీ క్రెడిట్ కార్పొరేషన్ పార్ట్నర్ ని. మా ఆఫీసు తిలక్ రోడ్ లో వుంది. ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు పని చేస్తుంది. ఆది వారాలు సెలవు. మా కంపెనీలో ఆరుగురు ఉద్యోగులున్నారు....నలుగురు ఆడవాళ్ళు, ఇద్దరు మగవాళ్ళు."

"ప్రొసీడ్," లాల్ అన్నాడు.

"ఆడవాళ్ళలో అనిత అనే ఆమె మూడు నెలల క్రితం చేరింది. మంచి సమర్థురాలు. అక్కౌంటింగ్ చూస్తుంది. ఎక్కడా తప్పులు పట్టనివ్వదు. మంచి చిత్తశుద్ధి గలది. పనితప్ప మరో ధ్యాసలేదు. మిగతావాళ్ళందరికంటె నాకామెపైన యెక్కువ యిష్టమేర్పడింది—కానీ ఆమె నా ఫీలింగ్స్ని కేర్ చెయ్యదు. మెచ్చుకున్నా మందలించినా అసలు రియాక్ట్ అవదు. స్తబ్దంగా వుండిపోతుంది. ఆమె స్వభావం అంతేననుకున్నాను. సరే, పని సక్రమంగా చేస్తున్నంతవరకు స్వభావంతో నాకు నిమిత్తం లేదు.

"ఆమె నాతో యెక్కువగా మాట్లాడదు. ఎంతో అవసరమైతే తప్ప నోరు విప్పదు. నా ఆఫీసు గదిలో ఒంట

రిగా వాళ్తో రెండు నిముషాలు వుంటే చాలు—నెర్వస్ అయిపోతుంది—వీలయినంత త్వరగా అక్కడ్నుంచి వెళ్ళి పోవాలని ప్రయత్నిస్తుంది.

"అదీ నేను పట్టించుకోలేదు. భయం ఎక్కువ ఆమెకి. నగర వాతావరణానికి కొత్త. ఇక్కడి సొసైటీ, మనుషులు, పద్ధతులు ఆమెని కలవర పెట్టేస్తాయి. ఆఫీసూ, ఇల్లు తప్ప మరో వ్యాపకం లేదు. ఒక సరదా లేదు. ఒక షోకు లేదు—"

"షోకు....? అంటే?" జాన్ అడ్డు తగిలాడు.

మహేంద్రనాథ్ కలవరంగా చూశాడు. వెంటనే తేరుకొని నవ్వాడు. "అంటే— ఆధునికత ఆమెకి తెలియదని నా ఉద్దేశం. అందంగా ముస్తాబవటం ఆమెకు రాదు. రాదో, తెలియదో నాకు తెలియదు. చాలా నిరాడంబరంగా వుంటుంది."

"వెల్, అది పూర్తిగా ఆమె వ్యక్తిగత విషయం. ఉద్యోగుల వ్యక్తిగత జీవితం మీ కనవసరమైన విషయం."

"నా ఉద్యోగుల్ని చాలా గౌరవంగా చూస్తాను, మిస్టర్ జాన్."

"మీ ఉద్యోగుల్లో ఆడవాళ్ళ నిష్పత్తి యెందుకు యెక్కువ వుంది?"

"వాళ్ళలో ఏకాగ్రత, కార్యదీక్ష ఎక్కువ వుంటాయి. మగవాళ్ళలా పని మానేసి హస్కుకొట్టడం, షికార్లు తిరగడం వంటివి వుండవు."

"ఐసీ....అందరూ వివాహితులేనా?"

"కాదు, ముగ్గురు అవివాహితులు."

"ఈ అనిత?"

"అవివాహిత."

"ప్రొసీడ్!" అన్నాడు లాల్.

"అనిత వయసు 22 వుండొచ్చు.... ఇరవై రెండే. నేనామె సర్టిఫికెట్ చూశాను. ఓ. కే. ఇక అసలు విషయం: అలా మూడ్నెల్లు గమనించాక ఆమెతో చనువు పెంచుకోకూడదనుకున్నాను."

"అంటే మిగతావారితో పెంచుకున్నారా?"

అతను నీళ్ళు నమిలాడు. "అవును.... పెంచుకో కూడదా?"

"కూడదని ఎలా అంటాను? అది మీ ఇరు పక్షాల మధ్య అండర్‌స్టాండింగ్. మూడో పార్టీ నాకభ్యం తరం లేదు."

"ప్రొసీడ్!" అన్నాడు లాల్.

"ఓ. కే. ఇప్పుడసలు విషయం.... అలా చనువు పెంచుకోకూడదనుకున్నాను గానీ.... నిన్న ఎందుకో మనసు మార్చుకున్నాను. ఆమెకు పద్ధతులు, మానర్స్— నా ఉద్దేశ్యం సొసైటీలో ఎలా మెలగాలో నేర్పాలను కున్నాను. ఇలా అనుకోవడం పొరపాటని నాకు తెలుసు. కాని నా ఉద్యోగి నా అభిరుచులకి—"

"ఆ మాట పూర్తి చెయ్యండి!" అన్నాడు జాన్.

"అంటే—ఆఫీసులో నేననుకొన్నవిధంగా ప్రవర్తిం చాలని నా అభిలాష. ఆఫీసుకెందరో పెద్దమనుషు లొస్తుంటారు. వాళ్ళందరితో సరదాగా నవ్వుతూ, కలుపుగోలుగా, బిడియపడకుండా మాట్లాడాలి. అలా చాలాసార్లు చెప్పి చూశాను. ఫలితంలేదు. అందుకే స్వయంగా నేనే పూనుకొని ఆమెలో భయం, బిడియం పోగొట్టి ఈ నాగరిక ప్రపంచానికి అలవాటు చెయ్యా లనుకున్నాను. ఇదెంత పొరపాటో నిన్న అనుభవ

పూర్వకంగా తెలుసుకున్నాను."
"ఎలా? ఏం జరిగింది?"
"నిన్న సాయంత్రం ఆమెనో కోరిక కోరాను. హోటల్ మయూర్‌లో గది తీసుకున్నాను, డిన్నర్‌కు రాగలవా అని—"
"ఏమిటీ! డిన్నర్‌కా!" జాన్ అన్నాడు కళ్ళు పెద్దవి చేసి.
నాథ్ కలవరపడ్డాడు. "అవును, ఎందుకలా అడుగుతున్నారు?"
"డిన్నర్—ఈ పదాన్ని మీరే ఉద్దేశంతో ఉపయోగించారు?"
"ఉద్దేశమా....అంటే?"
"అంటే—ఆమధ్య ఓ బొంబాయి నటుడు ఓ ఆడ జర్నలిస్టుని 'మిడ్‌నైట్ డిన్నర్ తినిపిస్తా'నని బెదిరించాడు. తర్వాత చంపడానికి ప్రయత్నించాడు. మీరు అదే ఉద్దేశంతో అన్నారా?"
"దానికి అలాటి అర్థం వస్తుందా, మిస్టర్ జాన్?"
"హోటల్ గది—డిన్నర్ అంటే ఇంకే అర్థం వస్తుంది? గ్రహించలేరా?"
"మిస్టర్ జాన్, ఈ ద్వంద్వార్థాల పురాణం నాకు తెలియదు. ఆమాట అన్నప్పుడు నా మనసు స్వచ్ఛంగా వుంది. ఎలాటి దురుద్దేశంలేదు. నా ఉద్యోగుల్ని చాలా గౌరవిస్తానని చెప్పాను."
"వెల్, యూ కెన్ ప్రొసీడ్" అన్నాడు లాల్.
"నా మాటలు విని ఆమె బెదిరిపోయింది. అంగీకరించలేదు. నచ్చజెప్పాను. అభయమిచ్చాను. చివరికి బలవంత

పెట్టాను. సహనం చచ్చి హెచ్చరిక చేశాను. నా ఇష్ట ప్రకారం నడచుకోకపోతే, కల్చర్ నేర్చుకోకపోతే, ఉద్యోగం ప్రమాదంలో పడ్తుందని బెదిరించాను. అంతే.

"అయినా ఆమె నన్ను ఖాతరుచెయ్యలేదు. ఇంటి కెళ్ళిపోయింది. బాగా ఆలోచించుకుని వస్తుందను కున్నాను. ఎనిమిది గంటలకు రమ్మన్నాను హోటల్ కి... కానీ ఇంతలోనే పరిస్థితి మరోవిధంగా రూపుదాల్చింది."

"ఏం జరిగింది?" జాన్ అడిగాడు.

"సాయంత్రం 6 గంటలకి ఆమె చెల్లెలు ఫోన్ చేసింది—నా ఇంటికి. ఆమె మాటలు విని నేను ఆశ్చర్య పడ్డాను. ఆమె ఏమందో తెలుసా? ఆమె అక్కను నేనవమానపర్చానట! అసభ్యంగా మాట్లాడానట! నేనామెని కామదృష్టితో చూసి ఆమె అమాయకత్వాన్ని ఎక్స్ప్లాయిట్ చేశానట! ఛీ....ఛీ! ఛీ! మిస్టర్ జాన్ ఈ అభాండం విని నా మనసు వికలమైపోయింది. హృదయం గిలగిల్లాడింది. కాళ్ళూ చేతులు ఆడలేదు!

"అబద్ధమన్నాను. బనాయింపు అన్నాను. నాకలాంటి దుర్బుద్ధి లేదన్నాను. ఊహుఁ....ఆమె వినలేదు. ఆమె ఎలాంటి తిట్లు తిట్టిందో సభ్యత దృష్ట్యా ఇక్కడ చెప్పడం మంచిదికాదు, జంటిల్ మెన్. ఆ అమ్మాయి పేరేమిటో గాని చాకు లాటిది!"

"మిస్టర్ లాల్" అన్నాడతను లాల్ వైపు తిరుగుతూ. "నన్ను చూస్తే మీకలా అనిపిస్తోందా? నా పెళ్ళయి పదేళ్ళయింది. ఇద్దరు బుడ్డి వెధవలున్నారు. నాకదేం బుద్ధి? అనిత నా మోటివ్ ని అపార్థం చేసుకుంది. ఆమె చెల్లెలితో చెప్పివుంటుంది—ఆ పిడుగు నామీద కత్తి కట్టింది!"

"మీరలా చెప్తూవుండండి" అన్నాడు లాల్.

"ఆమె ఇంకేం చెప్పిందో తెలుసా? తక్షణం ఇంటి కొచ్చి క్షమాపణ చెప్పుకోకపోతే నా చావు తథ్యమట! అప్పుడు నవ్వుకొన్నాను. క్షమాపణ కోరే గతి నాకేమిటి? నా ఉద్యోగిని క్షమాపణ కోరడమేమిటి, ఉద్యోగం లోంచి తీసిపారేస్తానన్నాను. అయినా ఆమె అలాగే బెదిరించింది. నేను వెళ్ళలేదు. ఇంతలో—అర గంటలో ఆమె అక్కను వెంటబెట్టుకొని నా ఇంటికొచ్చేసింది!"

"గో ఎహెడ్!"

"ఇంట్లో నా భార్యముందు, నా పిల్లలముందు, నౌకర్ల ముందు....అయ్యోయ్యో మిస్టర్ లాల్! నా పరువుతీసి ఉతికి ఆరేసింది!"

"ప్రొసీడ్!"

"ఆమెకు పట్టుమని పదేనిమిదేళ్ళుండవు, చిచ్చుబుడ్డిలా పేలింది! ఎన్ని చిచ్చుబుడ్లు, ఎలాటి చిచ్చుబుడ్లు నా మీద విసిరిందో నేను చెప్పలేను! నేనెలాటివాడినో సాక్షాత్తూ నా భార్య ముత్తుకున్నా విన్పించుకోలేదు. అప్పుడొక్కటే మాట—క్షమాపణ లేదా చావు!"

"ఎలా చావమంది?" జాన్ తెగించి అడిగేశాడు.

"మిస్టర్ జాన్, ఆమె బ్యాగులోంచి ఈ కత్తి తీసి నామీద దాడిచేసింది" అంటూ అతను బ్రీఫ్ కేసులోంచి ఒక కత్తితీసి చూపించాడు.

లాల్ దాన్ని అందుకున్నాడు. అది మామూలు కూరలు కోసుకునే స్టీలు కత్తి. వంచితే బ్లేడు వంగుతుంది. కొన మొనదేలిలేదు. పదును కూడా ఎక్కువలేదు. దానికి నల్లటి ఫైబర్ పిడివుంది.

"వెల్, మీరింకా చెప్పండి" అన్నాడు లాల్.

"ఆ కత్తితో నామీద దాడిచేసింది. ఏ కొంచెం ఏమరుపాటుగావున్నా అది నా రొమ్ముల్లో—ఇక్కడ గుచ్చుకునేదే! ఆమె చెయ్యి మెలిదిప్పి దాన్ని క్రింద పడేశాను. కాలితో దూరంగా తన్నాను. అంతవరకూ చెల్లెలి ప్రతాపం ముందు నోరు విప్పని అనిత, అప్పుడామెని లాగి దూరంగా ఈడ్చుకెళ్ళింది. రెండు దెబ్బలువేసింది. తన విషయాల్లో కల్పించుకొంటే-అంటూ ఏదో తిట్టింది. అయినా ఆ కోతిపిల్ల వూరుకోలేదు, మిస్టర్ లాల్. అక్కమీద ఎదురుతిరిగింది. చేతకానిదానివంది. చచ్చుదద్దమ్మవంది. ఆమెని వదిలి మళ్ళీ నామీద పడింది.

నేనదేపళంగా లేపి బయట ఎత్తేశాను. అనితనికూడా నెట్టేసి తలుపులు లాగేశాను. రేపట్నుంచి ఉద్యోగంలోకి రావద్దన్నాను. ఆ కోతిపిల్ల బయట చిందులేసింది. నా అంతు తప్పక చూస్తానంది! ఏదో క్షణంలో నా చావు తన చేతుల్లో ఖాయమైంది. అప్పుడామె ఉగ్రావతారాన్ని చూస్తే—ఓహ్! నిజంగా నాకది తథ్యమనిపించింది!

"అదీ జరిగింది, మిస్టర్ లాల్" అన్నాడతను ఊపిరి పీల్చుకుని. "ఆమె మాటలు తలచుకొంటేనే వెన్ను జలదరిస్తోంది. ఆమె చెప్పింది చేసితీరుంది! నామీద ఎంత కసిలేకపోతే అలా కత్తితో బయలుదేరి వస్తుంది? మొదట ఏమో అనుకున్నాను, కానీ ఇప్పుడామెని నమ్మలేను! నా ప్రాణాలకి మోసంవుంది. ఆమె పగబట్టింది!"

"ఒక పనిచెయ్యండి. పోలీసులకి—"

"ఓహ్, పోలీసు లొద్దు! నేనొప్పుకోను. నేను కంపెనీ ప్రతిష్ఠను దృష్టిలో వుంచుకోవాలి. నా పార్ట్‌నర్‌తో విభేదాలు రాకుండా చూసుకోవాలి. పోలీసులవల్ల అంతా

బయటపడుతుంది. జరిగింది అతనికి తెలిస్తే నన్ను నమ్మడు. నా కారెక్టర్‌ని అపార్థం చేసుకుంటాడు. పార్ట్‌నర్‌షిప్ నుంచి తక్షణం వైదొలగుతాడు—అతనిలాటివి అసలు సహించడు! నేను కుప్పకూలిపోతాను."

"అయితే మమ్మల్నేం చెయ్యమంటారు?"

"మీవల్ల ఏదీ బయటపడదు. ఆ అమ్మాయికి నచ్చ జెప్పండి. శాంతపర్చండి. నన్ను చంపితే ఆమెకేమొస్తుంది? పర్యవసానం ఆమె గ్రహించే స్థితిలో లేదు. వయసు అలాటిది. నన్ను చంపడంవల్ల ఆమె అక్క పరువు తిరిగివస్తుందనుకుంటే అసలు నేనామె పరువుని—ఒకవేళ నా మాటలు ఆమెని అవమానించే విధంగావుంటే నల్గురిముందు తీయలేదుకదా? అది ఆమెకు నాకూ మధ్య జరిగిన సంభాషణ. ఎవరూ వినలేదు. అదెప్పటికీ బయట పడే వీలులేదు. ఆమె నవ్వులపాలు కాదు.

"వెంటనే అక్కడికెళ్ళి ఆమెని ఒప్పించండి. అనిత పరిస్థితి నేనర్థంచేసుకోగలను. రేపట్నుంచి ఉద్యోగం లోకి రమ్మనండి. దయచేసి మీరీ పనిచేసి కంపెనీ శ్రేయస్సుని కాపాడండి!"

జాన్ సాలోచనగా చూసి తలూపాడు. "అలాగే చేస్తాం. కానీ మాకు ప్రేరణ కావాలి. కొంతడబ్బు కళ్ళ జూస్తే తప్ప రంగంలో దూకలేం?"

అతను వెంటనే పెద్ద కట్టతీసి టేబిల్ మీద వుంచాడు.

"అయిదువేలు—"

"ప్రస్తుతానికి పనికొస్తాయి. మీరిక నిశ్చింతగా వెళ్ళండి!"

"ఇదంతా జరగడం కేవలం దురదృష్టకరం!" అన్నా డతను లేచి కరచాలనం చేస్తూ. ఆ తర్వాత తన అడ్రసు

అనిత అడ్రసూ ఇచ్చాడు.

అతను వెళ్ళిపోయాక జాన్ నవ్వుతూ లాల్ ని చూశాడు.

"ఏమిటి నీ అయిడియా పార్ట్‌నర్?"

"ఈ క్లయంట్ కథ అల్లుకొచ్చాడు" లాల్ అన్నాడు.

"ఎందుకలా అనుకొంటున్నావు?"

"అతని ధోరణి, మాటలలా వున్నాయి. కొన్ని మాటలు అజాగ్రత్తగా వాడేసి అంతలోనే సవరించుకోవడం; ఉద్దేశాలు మార్చెయ్యడం, నువ్వు గమనించలేదా? హీ ఈజ్ డామ్ ఎక్సెలెంట్ యాక్టర్!

"జాన్, అతను చెప్పింది కొంతవరకు నిజం. కాని పూర్తిగాకాదు. అనితని బుద్ధిపూర్వకంగా చేరదీశాడు. కానీ బెడిసికొట్టడంతో ప్లేటు ఫిరాయిస్తున్నాడు. అసలు మోటివ్ ని మార్చేసి సదాశయాల్ని, సదుద్దేశాల్ని చాటుతున్నాడు. ఆమెకి కల్చర్ నేర్పుతాడా! డిన్నర్ ఇవ్వాలనుకుంటే హోటల్ గది ఎందుకు? పూర్ లయర్."

"ఇప్పుడేం చేద్దాం?"

"నువ్వెంటనే హోటల్ మయూర్ కెళ్లు. నిన్న అతను గది ఎప్పుడు తీసుకొన్నాడో తెలుసుకో. తరచు తీసుకొంటుంటాడేమో కనుక్కో. తీసుకొంటే అక్కడతని కలాపాలేమిటో కూపీ తీయ్. జాగ్రత్త. చాలా రహస్యంగా జరగాలీ పని. అతనికి తెలిస్తే బాగుండదు."

"ఓ.కే. మరి నువ్వేం చేస్తావ్?"

"ఇంకేం చేస్తాను!" అన్నాడు లాల్ నుదురుపట్టుకొని. "ఆ అక్కాచెల్లెళ్ళతో వాగ్యుద్ధానికి బయలుదేరతాను. వాదిస్తాను. ఖండిస్తాను. హెచ్చరికలు చేస్తాను. రాజీకోసం ప్రయత్నిస్తాను—"

"అక్కడేం? లుక్ లాల్, ఆ చెల్లెలిదగ్గర జాగ్రత్తగా వుండాలి!" అన్నాడు జాన్.

3

శాంతీనగర్ బస్ స్టాప్ ప్రక్కవీధిలో ఒక యింటి ముందు కారు దిగి లాల్ తలుపు తట్టాడు.

మరుక్షణం తలుపుతీసి ఓ యువతి దర్శనమిచ్చింది. వయసు పాతికమించదు. నాజుకైన విగ్రహం. కానీ ముఖంలో చెప్పలేని విషాదం కన్పిస్తోంది .... కొంత సమయం క్రితం ఎప్పుడో ఆమె బాగా ఏడ్చివుంటుందని ఎర్రబడ్డ కళ్ళు, కన్నీటి చారికలు ఏర్పడ్డ చెక్కిళ్ళు చెప్తున్నాయి.

"మిస్ అనిత?" అన్నాడు లాల్.

ఆమె కంగారుగా తలూపింది.

"లోనికి రావచ్చా?"

ఆమె అయోమయంగా చూసింది. "మీరు—మీ రెవరు?"

లాల్ ఎదురు ప్రశ్న వేశాడు. "మీరు బిజ్లీ క్రెడిట్ కార్పొరేషన్‌లో అక్కౌంటెంట్ కదూ?"

"బిజ్లీ కాదు, జాల్లీ."

"ఓహ్, అవును. నేను లాల్‌ని, డిటెక్టివ్. మీతో మాట్లాడాలి."

ఆమె ఉలిక్కిపడి గాభరాగా చూసింది.

"అలా భయపడకండి. మిత్రుడ్ని. లోనికి రానివ్వండి" ఆమె ప్రక్కకి తొలగడంతో లాల్ లోనికి నడిచి కుర్చీలో కూర్చున్నాడు.

"ఇలా రండి అనితా. మీ చెల్లెలెక్కడ?"

ఆమె అతనెదురుగా వచ్చి ఇంకా అయోమయంగా

చూసింది.

"రాగిణి—బజారు కెళ్ళింది—"

"దేనికి?"

"సరుకులకి—కూరగాయలకి—"

"వెల్, భయపడకండి. కూర్చోండి. మీ బాస్ మమ్మల్ని కలిశాడు. నిన్న జరిగిందంతా చెప్పాడు. మీరతన్ని అపార్థం జేసుకొన్నారు. మిమ్మల్ని గురించి అలాటి ఆలోచనలు అతనికెప్పుడూ—"

"ఇప్పుడు మిమ్మల్ని క్షమాపణలు చెప్పి పంపాడా?"

"కాదు, ఆ పని జన్మలో చెయ్యడనుకొంటాను. ఎందుకు చెప్పుకోవాలి? అతనేం తప్పుచేశాడు? అంతా మీరు తప్పుగా అర్థంజేసుకొన్నారు. దౌర్జన్యానికి పాల్పడ్డారు. మీ మనస్థితి నతను అర్థంజేసుకొన్నాడు. మీపట్ల అతనికి చాలా సానుభూతి వుంది. జరిగిందంతా పీడకలగా మర్చిపోయి తిరిగి ఉద్యోగంలోకి—"

"ఆపండి మీ మాటలు!" అడ్డుతగిలిందామె ఆవేశంగా. "నాకతని క్షమాపణ వద్దూ, అతని ఈ రాజీ వద్దు. ఇలాంటి పరిస్థితిని నేనెప్పుడో ఆశించాను. ఈ ఉద్యోగం ఇప్పుడు నా కనవసరంలేదు.

"నా మానర్స్‌ని, నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికతనెవరు? నాకు ప్రవర్తన నేర్పడానికతనికేం అర్హత వుంది? మిస్టర్ లాల్, మీకతను అన్నీ కట్టుకథలు చెప్పి వుంటాడు. తన్ని సమర్థించుకొని వుంటాడు. మీరతన్ని గుడ్డిగా నమ్మేసి ఇలా వచ్చారు, నేనపార్థంజేసుకున్నాననుకొంటూ!"

"మీ రపార్థంజేసుకోలేదా?"

"ఇందులో అసలు అర్థం చేసుకోడానికే ఏమీ లేదు!

ఇంక అపార్థం ఎక్కడ వుంటుంది? అంతా స్పష్టంగా కన్పిస్తోంది.... మీకు కాదు, నాకు. నేనమాయకురాల్ని కావచ్చు. నాకు పద్ధతులు తెలియకపోవచ్చు. కాని ఎదుటివారి ఆలోచనల్ని పసిగట్టలేని ఎదగని మనసేమీ కాదు నాది. మొదట్నుంచీ అతన్ని గమనిస్తున్నాను. అతని మాటల్లో, చేతల్లో అంతా చూస్తున్నాను. నామీద అతనికి—పచ్చిగా చెప్పాలంటే—"

"చెప్పండి?"

"ఎంత ఆకలిగా వుందో!"

"నిజంగానా?"

"నిజంగా! ఆ మాత్రం అర్థంజేసుకొని జాగ్రత్తలో వుండకపోతే ఈ భూమ్మీద ఆడది పదికాలాలు కాకపోయినా మూడు కాలాలు మనగల్గడం కష్టం.

"మహేంద్రనాథ్ నా విషయంలో నిన్న బయట పడ్డాడు. ఆఫీసులో మరో ఇద్దరితో ఎలా ప్రవర్తిస్తాడో, వాళ్ళతో అతనికున్న చనువు ఎలాటిదో నాకు బాగా తెలుసు. నన్నూ వాళ్ళలాగే భావించాడు. ఆ దృష్టితోనే చూశాడు. అతని డబ్బూ హోదా చూసి తేలిగ్గా వల్లో పడ్తాననుకున్నాడు. సొసైటిలో ఆధునికంగా మెలగడమంటే నైతిక విలువల్ని వదులుకోడమనుకున్నాడు కాబోలు! అతని అంతస్తూ, ఆహ్వానం చూసి నిబ్బరం కోల్పోతాననుకున్నాడేమో, నిన్న నన్ను హోటల్ గది కీడ్చడానికి ప్రయత్నించాడు!

"మిస్టర్ లాల్, ఆ ప్రయత్నం బెడిసికొట్టడంతో అతని మాటల్లో అర్థాన్ని వక్రీకరిస్తున్నాడు. ఉద్దేశాన్ని మార్చి ప్రకటించుకుంటున్నాడు. 'హోటల్ మయూర్‌లో గది తీసుకున్నాను—సాయంత్రం డిన్నర్‌కు వస్తావా?'

అనంటున్నప్పుడు ఆ మాటల్లో వెకిలితనం, ద్వంద్వార్థం, కుళ్ళు ఉద్దేశం పసిగట్టలేరా మీరు,అతని చరిత్ర ఎలాటిదో తెలిసి వుంటే?"

లాల్ తలూపాడు.

అనిత అంది. "కానీ నాకు వేసిన ఎర తిరిగి అతని మెడకే ఉరికావడంతో పిరికిపంద అయ్యాడు! అతని కిప్పుడు రాగిణి భయం బాగా పట్టుకుంది. ఉండి ఉండి ఏ అఘాయిత్యం జరుపుతుందోనన్న జంకుతో మిమ్మల్నిలా పంపాడు. సరే, ఆమెని నచ్చజెప్పే ప్రయత్నాలేవో మీరే చెయ్యండి. కానీ నేను ఉద్యోగంలో చేరే ప్రసక్తి మాత్రం తేకండి దయచేసి! ఆ ఉద్యోగానికో నమస్కారం."

"మీ చెల్లెలు సీరియస్‌గానే తీసుకుందా?"

"దాని పట్టుదల, ఆవేశం మీకు తెలియవు. అదలా ప్రవర్తించకుండా వుండలేదు, అలాటి పరిస్థితిలో. నేనసలు చెప్పకుండా వుండవల్సింది. సెలవులకి ఇక్కడకొచ్చింది మొన్ననే. మహేంద్రనాథ్ ప్రవర్తనకి ఏడుపుతో బరువెక్కిన గుండెల్ని దానితో చెప్పి తేలికబర్చుకో కుండా ఉండలేకపోయాను. అదిలా చేసింది—"

"నిన్న ఆమె కత్తితో దాడిచేసింది. ఇప్పుడూ అదే ఉద్రేకంతో ఉందా?"

"అదే స్థితిలో వుంది. అతన్ని చంపకుండా వదల నంటోంది, అవకాశం మాత్రమే కావాలట."

"చూడండి, మిస్ అనిత, మీరు వెంటనే ఆమెను తీసుకొని మీ ఊరెళ్ళి—" అప్పుడే లోనికొస్తోన్న రాగిణిని చూసి లాల్ మాటలాపేసి సర్దుకున్నాడు.

రాగిణి సంచీ పట్టుకొని లోనికొచ్చి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఈయన డిటెక్టివ్ లాల్, రాగిణి. నమస్కరించు" అంది అనిత.

"నమస్తే. ఏమిటిలా వచ్చారు?" అందామె ముఖం చిట్లించి.

లాల్ ముందు నవ్వాడు. తర్వాత ఆమెని పరీక్షగా చూస్తూ తటపటాయించాడు. కొన్ని క్షణాలవరకూ అతని గొంతు పెగల్లేదు.

"అలా కూర్చో, రాగిణి. నీతో మాట్లాడాలి."

"నిల్చొని మాట్లాడ్డం నాకలవాటు."

"అలాగా? అలాగే, అలాగే.... కూరగాయలు తెచ్చావా?"

"అవును."

"ఏం కూరగాయలు, రాగిణీ?"

"ఇంటికొచ్చిన అతిథులు అలా కూరలేమిటీ, పులుసేమిటీ అనడగరు! ఏమిటి మీరొచ్చిన పని?"

"రాగిణీ! నువ్వలా మాట్లాడకూడదు. ఆయనకు మర్యాద యివ్వు."

"సరే, అయితే ఆ అప్రాచ్యుడు డిటెక్టివ్‌ల సహాయం కోరుతున్నాడన్నమాట?"

లాల్ అన్నాడు. "నువ్వు ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నావ్, రాగిణి. చట్టం దృష్టిలో తీవ్రమైన నేరం. ఒకర్ని చంపుతానని బెదిరించటం తీవ్రమైన పరిణామాలకి___"

"పరిణామాలు నాకనవసరం. అతన్ని చంపడమే నా ధ్యేయం!"

"ఎందుకని?"

"ఎందుకేమిటి? ఏమీ తెలియనట్లు మాట్లాడుతారు. మీ సోదరి నెవరైనా అవమానిస్తే వూరుకొంటారా?"

లాల్ కావాలని బలవంతంగా నవ్వాడు, "నాకు సోదరిలేదు మైడియర్ యంగ్ గర్ల్. నాకున్న ఆత్మీయు డొక్కడే—జాన్, సోమరి పార్టనర్."

ఆమె కోపంతో ఒక్క కేక పెట్టింది. "మీకు సోదరి లేదని లోకంలో ఎవరికీ వుండదనుకున్నారా! మీ డిటెక్టివ్‌ల ధోరణే అంత! మీకో ఇల్లూ, వాకిలీ, ఫ్యామిలీ, నా అనేవాళ్ళూ ఎవరూ వుండరు! దేశ దిమ్మరుల్లా తిరగడమే పని! మీకులాటి ఫీలింగ్స్ నాకు లేవు. మా అక్కయ్యకు అన్యాయం జరిగింది. తీవ్రమైన పరాభవం జరిగింది. నేను న్యాయంగా క్షమాపణ కావాలన్నాను. వాడు ఒప్పుకోలేదు. నన్ను రెచ్చగొట్టాడు. నా రక్తం మరుగుతోంది. వాడ్ని చంపి పగతీర్చుకోకుండా వదలను!"

"నువ్వాపని చెయ్యలేవు. నీ వైఖరి మార్చుకోకపోతే అతను పోలీస్ కంప్లెయింట్ ఇస్తాడు. కనీసం మూడు నెల్లు జైల్లో కూర్చుంటావు."

"ఏమిటీ! పోలీస్ కంప్లెయింట్ ఇస్తాడా, తప్పు తను చేసి! గుండెలెన్ని వాడికి? సరే, అలాగే చెయ్యమనండి. నేనపుడు మూడ్నెల్లుకాదు, జీవితాంతం జైల్లో కూర్చోడానికి సిద్ధంగా వుంటాను—వాడ్ని సఫాచేసి!"

"షటప్!"

"ఎలాగైనా వాడి చావు నా చేతిలో ఖాయం!"

"షటప్, యూ స్టుపిడ్. నేనిప్పుడే పోలీసుల్ని పిలుస్తాను. అదో ఘనకార్యమనుకున్నావా? దాన్ని నీ

అక్క - హరి స్తుందనుకున్నావా? కుమిలిపోతుంది. కృంగి కృశించిపోతుంది, జీవితాంతం ఏకు పే మిగులుతుంది! నువ్వు కటకటాల వెనుక కూర్చొని గొప్ప ఉపకారం చేశానని వెకిలిగా నవ్వుతుంటావు! మురిసిపోతావు. వెర్రిగా గర్వపడతావు. ఇక్కడ నీవాళ్ళు నిన్ను తలచుకొని అన్నివిధాలా నాశనమవుతారు—

"నీలో ఆవేశం తప్ప ఆలోచన లేదనుకొంటాను. నీ కుటుంబాన్ని చేతులారా నాశనం చేస్తావు. నీకింత పట్టుదల కూడదు. నాథ్ మీ అక్కయ్యని నలుగుర్లో అవమానించలేదు. అది వాళ్ళిద్దరిమధ్య జరిగిన సంభాషణ. దాన్ని సాగదీసి బట్టబయలు చేసుకోడం మంచిదికాదు. అదెప్పటికీ ఆ ఇద్దరిమధ్యే వుండిపోతుంది. ఇహ జరిగింది చాలు. ఉద్యోగాలుచేసే ఆడవాళ్ళకిలాటి అనుభవాలు సర్వసామాన్యం. పట్టించుకోకూడదు. చూసీచూడనట్లుండాలి. ఎప్పటికప్పుడు మర్చిపోతుండాలి—"

"నేనేదీ మర్చిపోను. ఇది వాళ్ళిద్దరిమధ్య వ్యవహారమైతే ఆమెతో ఏకాంతంలోనే క్షమాపణ వేడుకోమనండి. ఏమిటి నామోషీ? అంత ఆత్మాభిమానం వుంటే ప్రాణభయం ఎందుకు? ఆత్మాభిమానంతోనే చావమనండి! సాయంత్రం 5 గంటలవరకు సమయమిస్తున్నాను. ఈలోపు ఇక్కడికి స్వయంగా వచ్చి అక్కయ్య చేతులుపట్టుకొని క్షమాపణ వేడుకోకపోతే...."

"నీ నిర్ణయం మారదన్నమాట?"

"ముమ్మాటికీ మారదు!"

"పరమ మూర్ఖురాలివి నువ్వు!"

"పరమ విసుగ్గా వుంది నాకు! వెళ్ళిపోండిక్కడ్నించి!" అర్చిందామె కళ్ళెర్రజేసి.

4

సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకి జాన్ ఏజెన్సీ ఆఫీసులో ప్రవేశించాడు.

“పార్టనర్! నీకు సీతాశోక చిలుకల గురించి తెలుసా?”

లాల్ తలెత్తి పరధ్యానంగా చూశాడు.

“ఏమిటలా వున్నావ్? ఏమైంది?”

లాల్ కుడిచెయ్యెత్తి నుదుటిమీద కొట్టుకున్నాడు.

“లాల్! వాట్ యార్! ఏం జరిగింది.... బీటింగ్?”

“ఓహ్, కాదు. నా నీతివాక్యాలు కొన్ని ఆమెకి బోధించాను. విని గెటవుట్ అంది.”

“అయితే నిర్ణయం మార్చుకో లేదన్నమాట! బహిరంగంగా ఛాలెంజి చేస్తోందా? అలా చేసే ధైర్యముందా ఆమెకి?”

“ధైర్యమైతే ఉంది, కానీ అవకాశం లేదు-వుండదనుకుంటాను. అనిత ఆమెని తీసుకొని ఊరెళ్ళిపోతే ఏ గొడవా వుండదు. అందుకు రాగిణి వ్యతిరేకిస్తే మాత్రం క్లయింట్ని హెచ్చరించవల్సి వుంటుంది. నువ్వేం కనుక్కున్నావు?”

జాన్ సిగరెట్ ముట్టించి అదోలా నవ్వాడు. “సీతాశోక చిలుకలు, పార్టనర్! అందమైన, ఆకర్షణీయమైన రంగు రంగుల చిలుకలు! అను నిత్యం అవి అతనిచుట్టూ ఎగురుతూ, అతనిమీద వాలుతూ, ఇచ్చి పుచ్చుకొనే ధర్మాన్ని నిర్వర్తిస్తుంటాయి .... డూయూ అండర్‌స్టాండ్? ఆ చిలుకలు ఎన్ని, ఎలాంటివి, ఏం చేస్తుంటాయి, ఎక్కడ వుంటాయి, మొదలైన ప్రశ్నలకి సమాధానాలు నాదగ్గరగానీ, రాంబాయ్ వద్దగానీ, చివరికి మహేంద్ర

నాథ్ దగ్గర గానీ లేవు!"

"ప్రొసీడ్!"

"ఏమిటి నీ ప్రొసీడ్ ట్రాఫిక్ పోలీసులా? నీ స్టయిల్ నా దగ్గర కాదు, ఇక విను! హోటల్ మయూర్ పెయిస్....అంత స్తులో, అంటే చివరి అంత స్తులో మన క్లయింట్ కో పర్మనెంట్ గదివుంది. రూం. 124. ఆ గది అతని ప్రేమ పంజరం—అంటే సీక్రెట్ లవ్ స్పాట్ వంటిదన్నమాట. ఆ పంజరంలోకి సాయంత్రం ఆరయ్యేసరికల్లా చిలుకలు వాలుతుంటాయి....అంటే ఒక్కొరికి మించికాదు.

"మహేంద్రనాథ్ భాషలో ఈ చిలుకలు వాల డాన్ని డిన్నర్ కాహ్వానించుట అంటారు—రూం బాయ్ చెప్పాడు. ఈ రూం బాయ్ మొదట నోరు విప్పలేదు. భయపడ్డాడు. అనుమానించాడు. సందేహించాడు. ఇలాటి సందేహ జీవుల వీక్ నెస్ నాకు బాగా తెలుసు. పచ్చ కాగితం ఒకటి రెపరెపలాడించేసరికి వాటన్నిటినీ వాహ్యాళికి పంపించేసి, నా తాళానికనువుగా కీర్తన లాలాపించాడు....

"ఓ.కే, ఇప్పుడు సీరియస్ గా చెప్తాను విను. ఈ రూం బాయ్ పేరు నాగేష్. పాతికేళ్ళు. పహిల్వాన్ లా వున్నాడు. అతను చెప్పినదాన్నిబట్టి వారం క్రిందట నాథ్ కు అతని ఆఫీసులోనే పనిచేసే నీల అనే ఆమెతో గొడవ జరిగింది. ఇదివరకెప్పుడూ ఎవరితోనూ అలాటిది జరగలేదు. మరో సంగతేమిటంటే, అతని కెందరితో వ్యవహారాలున్నా ఎవరికీ మరొకరితో అతనికి బాంధవ్య ముందని తెలియదట. ఎవరికివారు తామొక్కరే అతని ప్రేయసి అనుకొని మురిసిపోయేవారేనట—అంత పటి

ష్టంగా సాగిస్తున్నాడు."

"గొడవ ఎందుకు జరిగింది? రూం బాయ్ విన్నాడా?"

జాన్ తలూపాడు. "ఈ రూం బాయ్‌కి కుతూహల మెక్కువ, పైగా తెలివిగలవాడు. అసలా హోటల్‌లో నాథ్ కలాపాలు చట్టవ్యతిరేకం. వాటిని హోటల్ వాళ్ళు అనుమతించడం కూడా నేరమే. హోటల్ చాలావరకు అలాటి కలాపాలమీదే జీవిస్తోందని చెప్పాడు. ఇక నాథ్ ఆ గదిలో చేసేపనుల్ని రహస్యంగా గమనించడం నేరంకాదని వాదిస్తున్నాడు...."

"మనం రూం బాయ్ మనస్తత్వాన్ని విశ్లేషించడం లేదు. నాథ్ సమస్యకో పరిష్కారం కావాలి. అసలు గొడవెందుకు జరిగింది?"

"సరే, చెప్తాను. రజని అనే మరొకామెను నాథ్ రహస్యంగా కలుసుకుంటున్నాడని నీల ఘర్షణపడిందట. పాపం ఆ పిచ్చి తల్లికి నాథ్ అంతఃపురంలో జనానా సంఖ్య తెలీదు. ఆ జనాభాలో కేవలం తనూ ఒకతెనని కూడా తెలియదు! అతని కోటలో తనొక్కతే రాణి అని మురిసిపోయింది....ఒక్క చెలికత్తె గురించి తెలిసి చిందులు తొక్కింది. ఉంచిన విశ్వాసం, చేసిన బాసలు వమ్ముచేశావని దాడిచేసింది. అతన్ని మరొకరితో పంచుకోవడం సహించదట. తనని నిర్లక్ష్యంచేసి కానుకలూ, బహుమానాలూ ఇతరులకి సమర్పించుకోడం భరించనందట.

నాథ్ చాలారోజులుగా భార్యకి విడాకులిచ్చి ఆమెని చేసుకుంటానని చెప్తున్నాడట. అది కేవలం తన్ని మభ్యపెట్టడానికి బుకాయింపని ఆరోపించిందట. ఇప్పుడు మరొకర్ని అలా బుకాయిస్తూ, ఇంకెందర్ని ఇలా బుకా

యిస్తూ కాలక్షేపం చేస్తున్నాడో ఎలా నమ్మాలని ఏడ్చిందట. అతన్ని నమ్మితన్ని సమర్పించుకుంది. ఇప్పుడు తన గతేమిటని బావురుమందిట. రజనిని మర్చిపోయి వెంటనే తన్ని పెళ్ళాడకపోతే కిటికీతీసి ధామ్మని దూకేస్తానని బెదిరించిందట!"

"నాథ్ ఏమన్నాడు?"

"ఏమంటాడు? ఆమె మాటలన్నీ అబద్ధమన్నాడు. ఇలాంటి వాళ్ళు అబద్ధాలాడ్డంలో ప్రవీణులై వుంటారు. నిన్ను చేసుకోను పొమ్మని చెప్పలేదు. ఇంకా ఆమెని నచ్చజెప్పడానికీ, నమ్మించడానికీ అబద్ధాల పరంపరను కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లా వదిలాడట. ఆమె నమ్మేసింది, తేలికపడింది. అమాయకురాలు.

"కానీ లాల్, ఇవ్వాళ డీ అనిత వ్యవహారం కూడా తెలిస్తే ఎలా రియాక్టు అవుతుంది? కిటికీతీసి ధామ్మని రెండుసార్లు దూకుతుందా?"

లాల్ అడ్డంగా తలూపాడు. "నాథ్ అందుకే జాగ్రత్తగా మసలుకొంటున్నాడు. నేను ఫోన్ చేసి రాగిణి గురించి చెప్తే పోలీసు కంప్లెయింట్ ఇవ్వడానికి అసలు ఒప్పుకోలేదు. ఆమె 5 గంటలవరకు గడువిచ్చింది. ఆ సమయంలో ఆమెని కనిపెట్టి, వెంటాడి, తనకోసం బయలుదేరి వస్తోంటే, దార్లో ఏ గొడవలోనో ఇరికించి పోలీసుల చేతుల్లోకి నెట్టమన్నాడు."

జాన్ నిటారుగా కూర్చున్నాడు. "నిజంగానా?"

"నిజంగా. ఇప్పుడతనికి పార్ట్నర్ భయం, నీల భయం రెండూ వున్నాయి. వ్యవహారం పొక్కితే ఏమవుతుందో నీకు తెలుసు. నాథ్ కలాటి శాస్తి జరగాల్సిందే

గాని, ఒక ప్రాణం మనచేతిలో వుందిప్పుడు. ఈ నీల నిజంగా ఆత్మహత్య కొడిగడుతుందా?"

"ఆమె కంతటి సత్సాంప్రదాయం, ఆత్మాభిమానం వుంటే తప్పదు! నాథ్ ఆమెను పెళ్ళాడ్డం కల్ల."

"వెల్, అతని పార్టనర్ వల్ల నాథ్ నాశనమవుతాడు. నాథ్ వల్ల, నీల ఆహుతికావచ్చు. కనుక నాథ్ గురించి మనం ఉదాసీనంగా ఎందుకుండాలి? అతన్ని ఉపద్రవం నుంచి తప్పిస్తే నీలను కాపాడినవాళ్ళ మవుతాం, తాత్కాలికంగా; మనకు సంబంధించినంతవరకూ, ఆ తర్వాత ఏంజరిగినా మన బాధ్యత ఉండదు."

జాన్ నవ్వాడు. "అందుకని రాగిణి మీద కేసు బనాయించి పోలీసుల చేతుల్లో పెట్టాలా? బ్రదర్, అప్పుడామె అంతా వాళ్ళకి చెప్పేస్తే!"

"అలా చేయమని నాథ్ సూచించాడు. కానీ మనం చేయడంలేదు—ఆమెని కిడ్నాప్ చేయబోతున్నాం!"

"ఓహ్, ఓహ్, అదెలా?"

"అదిలా! మనిద్దరం క్రూక్స్. మారువేషంలో అద్దె కార్లో వెళ్తాం. ఆమె ఇంటినుంచి బయలుదేరాక కొంత దూరం వెంటాడి, హఠాత్తుగా లాగి కార్లో ఎత్తేస్తాం. కళ్ళూ నోరూ, కాళ్ళూ చేతులు కట్టేస్తాం. మారుమూల ప్రదేశానికి తీసికెళ్ళి ఆమె గట్స్ ఎగరగొడ్తాం, అందుకో చోటు ఎన్నుకోవాలి. కనీసం రెండురోజులక్కడ వుంచి తగిన ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. గంపెడు భయాల్ని కల్గించి వదలాలి. ఆమెని దోచుకునే ప్రయత్నాలు చేస్తూనే, మరోవైపు తప్పించుకొనే అవకాశమూ ఇస్తుండాలి.... ఇది చాలా డర్టీ జాబ్. అయినా తప్పదు. దాంతో ఆమెకి ప్రాణం విలువ తెలిసిరావాలి. లెంపవేసుకొని ఈ

ఊరు వదిలి పారిపోవాలి."

జాన్ అయోమయంగా చూశాడు. "ఆ పని నువ్వు చేస్తావా! సిస్టర్, మీకేం భయంలేదు—నేనున్నానని నోరు జారితే? ఎదురు తిరిగి నన్ను కొడితే?"

లాల్ నవ్వాడు. "ఐ డోంట్నో! నిన్ను కొట్టే పరిసితి నువ్వే కల్పించవచ్చు, అది నటన అని మర్చిపోయి నీ గర్ల్ ఫ్రెండ్స్ జ్ఞాపకమొస్తే."

5

మధ్యాహ్నం లంచ్ కి వెళ్ళి తిరిగివచ్చిన డిటెక్టివ్ లకు ఆఫీసు కారిడార్ లో అనిత తచ్చాడుతూ కన్పించింది.

"మిస్ అనిత!" అన్నాడు లాల్ వేగంగా సమీపించి "ఏమిటి, మీరిక్కడేం చేస్తున్నారు?"

ఆమె గిరుక్కున తిరిగిచూసింది. ఆమె ముఖం పాలి పోయివుంది. కళ్ళలో భయం వర్ణనాతీతం. అవి ఎర్రబడి, వాచివున్నాయి.

"లాల్!" అందామె దగ్గరకు జరిగి, ఆమె కళ్ళలో గిరుక్కున నీళ్ళు తిరిగాయి. అకస్మాత్తుగా దుఃఖం పొంగు కొచ్చి, లాల్ ని పట్టుకొని భుజంమీద తలవాల్చేసింది.... వెక్కి వెక్కి ఏడ్వసాగింగి....

జాన్ చటుక్కున తాళంతీసి తలుపు తెరిచాడు.

లాల్ ఆమె బరువు నాపుతూ భుజంమీద తట్టాడు. "టేకిట్ ఈజీ.... టేకిటీజ్...." ఆమెని నడిపించి తెచ్చి సోఫాలో కూర్చోబెట్టడంతో ఏడ్పు ఇంకా ఎక్కువైంది. లాల్ మృదువుగా ఆమె చెయ్యి నిమిరాడు.

"పిచ్చిపని! ఏమిటిది! తేరుకోండి...."

ఆమె తలెత్తి ఆవేదనగా చూసింది. "రాగిణి పారి పోయింది, లాల్!"

"ఎ—ఏమిటి—ఏమిటి మీర నేది?"

"అవును! రాగిణి పారిపోయింది!"

"ఎప్పుడు? ఎలా?"

"తెలియదు! ఈ ఉత్తరం వదలి వెళ్ళింది." వెక్కిళ్ళతో ఆమె బ్యాగులోంచి ఒక కాయితం తీసిచ్చింది.

లాల్ గాభరాగా విప్పిచూశాడు. అందులో ఇలా వుంది—

"ఈ డిటెక్టివ్ వెళ్ళిన క్షణాన ఏం జరుగుతుందో నాకు తెలుసు. అందుకే వెళ్ళిపోతున్నాను. పోలీసులకి భయపడికాదు. వాళ్ళు నన్ను ముందుగా అరెస్ట్ చేస్తే నా లక్ష్యం నెరవేరదు. మహేంద్రనాథ్ సంగతి తేల్చిగాని ముందుకు రాను. సాయంత్రం 5 గంటలవరకు గడువిచ్చాను. ఈలోపు ఇంటికొచ్చి క్షమాపణ చెప్పుకొంటే సరేసరి! లేకపోతే—

వాడి గుండెలో బాకు దింపుతానంతే!—

—రాగిణి"

జాన్ కూడా ఆ ఉత్తరం చదివి, "డామిట్! ఎలా జరిగింది!" అనర్చాడు.

అనిత అంది. "మీ రెళ్ళిన కాస్సేపటికి ఆమె కన్పించలేదు. కంగారుపడ్డాను. నాథ్ దగ్గరికెళ్ళిందనుకున్నాను. కానీ గడువిచ్చి అప్పుడే వెళ్ళదనిపించింది. బజారు కెళ్ళిందనుకున్నాను....ఎంత సేపటికీ తిరిగిరాలేదు. అంతలో టేబిల్ మీద ఈ ఉత్తరం చూశాను."

లాల్ విసురుగా వెళ్ళి ఫోన్ ఎత్తాడు.

"వెల్, మీరేం భయపడకండి!" అన్నాడు జాన్. "ఆమె ఏమీ చేయదు. ఆమె నాథ్‌ని కనిపెట్టొంటే ఆ

పరిసరాల్లోనే సమీపంలో ఎక్కడో వుంటుంది. ఆ చుట్టుపక్కల జాగ్రత్తగా కనిపెట్టివుంటే పట్టుకోవడం కష్టంకాదు...."

"మిస్టర్ నాథ్" లాల్ అంటున్నాడు ఫోన్‌లో, "వ్యవహారం బెడిసింది! లాభంలేదు. ఆమె ఇంట్లోంచి పారిపోయి మిమ్మల్ని కనిపెడుతోంది. మీ ప్రాణాలకి గ్యారంటీలేదు....వచ్చి క్షమాపణ చెప్పుకోండి! ఏమిటీ... గట్టిగా చెప్పండి....నో! ఆమెనిప్పుడు పట్టుకోగలమని నిశ్చయంగా చెప్పలేను. రిస్కు. మీ ప్రాణాలకే రిస్కు. వినిపించడంలేదు, గట్టిగా మాట్లాడండి దయచేసి! ఓహో, ఎలా చంపుతుందంటారా? మీరలా కాగ్లోపోతుంటే ఎక్కడైనా పొంచివుండి కత్తి విసరవచ్చు—కొద్ది మార్పుతో కెన్నడీ పైపు మర్డరన్నమాట. లేదా— వెల్, ఇప్పుడు మేం ఏమీ చెయ్యలేం. పోలీసుల్ని పిలిస్తే ఆమెని పట్టుకోడం సులభమవుతుంది...."

లాల్ కోపంగా అన్నాడు మళ్ళీ. "మీరెందుకంత చిన్నగా మాట్లాడుతున్నారు? అక్కడెవరైనా వున్నారా? మరి, కాస్త గట్టిగా మాట్లాడండి! ఏమన్నారూ .... ఓహ్, అలాగా .... అవును. కానీ మీరవన్నీ మర్చిపోవాలిప్పుడు....ఏమిటీ...."

లాల్ అవతలి మాటలు కొన్ని క్షణాలు ఉద్రిక్తంగా విన్నాడు. "కానీ ప్రయోజనముండదనుకుంటాను. అవును ఇదీ రిస్కే! ఎలా?....అలాగా? ...సరే, సరే, మీ ఇష్టం. తర్వాత మమ్మల్ని బ్లేమ్ చెయ్యకూడదు!"

ఫోన్ పెట్టేసి జాన్ వైపు తిరిగాడు. "వెల్, క్షమాపణ చెప్పుకోడట. పోలీసుల్ని పిలవడట. ఎట్టి పరిస్థితిలోనూ ఆ పని చెయ్యడట. పార్టనర్ గురించి భయ

పడుతున్నాడు. అతను చాలా క్రమశిక్షణ పాటించే వ్యక్తిట. ఎక్కడ మర్యాద తప్పినా సహించడట— తనకు సంబంధించిన వ్యవహారాల్లో."

"ఆల్ రైట్, అయితే ఏం చెయ్యమన్నాడు?"

"మనల్ని బాడీగార్డుగా రమ్మంటున్నాడు."

"బాడీగార్డ్స్! ఇంకా నయం—"

"ముందు విను! అతన్ని అంటిపెట్టుకునుంటే ఆమెని పట్టుకోవడం సులభం. ఆమె అతని దగ్గర్లోనే ఎక్కడో పొంచివుండి గమనిస్తుంటుంది. నాథ్ తో అలా ఒకసారి షైరుకి బయలుదేరితే అతని వెనుక ఆమె కూడా...."

"జస్టెమినిట్, జస్టెమినిట్, జంటిల్ మెన్!" ఒక అజానుబాహుడు లోనికొస్తూ అరిచాడు. "ఏమిటీగోడవ? ఏమిటీ హడావిడి! నా పార్ట్ నర్ ఏం చేశాడు?"

డిటెక్టివ్ లు కలవరపడి అతన్ని చూశారు.

అనిత భయపడిపోయింది.

"ఎక్స్ క్యూజ్ మీ, మీరు—" లాల్ గొణిగాడు.

"నేను జూబ్లీ క్రెడిట్ కార్పొరేషన్ పార్ట్ నర్ ని. నా పేరు నరేంద్రపాటిల్. మహేంద్రనాథ్ పార్ట్ నర్."

"ప్లీజ్ సిడవున్."

"మిస్టర్ లాల్ మా కంపెనీ ఇప్పుడిప్పుడే వృద్ధిలోకొస్తోంది. ప్రజల్లో విశ్వాసం ఏర్పరచుకుంటోంది. రోజు రోజుకీ మా లావాదేవీలు పెరిగిపోతున్నాయి. మామీద ఎంతో నమ్మకంతో ప్రజలు తమ ధనాన్ని మావద్ద పొదుపుచేస్తున్నారు. తిరిగి మేమూ సులభ పద్ధతుల్లో ఎన్నో సంస్థలకీ, వ్యక్తులకి లోన్స్ ఇస్తున్నాం.... ఇలాంటి కంపెనీలు, డబ్బు వ్యాపారం చేసే కంపెనీలు బ్యాంకుల్లాగా నమ్మకంగా, సమర్థంగా పని చేయాలి. ఈ

కంపెనీలు నడిపే వ్యక్తులు కూడా మంచి వ్యక్తిత్వంతో, క్రమశిక్షణతో వుండాలి. వ్యక్తి నడవడిక మీద కంపెనీ శ్రేయస్సు, ప్రజల విశ్వాసం ఆధారపడి వుంటుంది."

లాల్ ఓరగా జాన్‌ని చూసి, "ప్రొసీడ్!" అన్నాడు.

పాటిల్ అన్నాడు. "నేను వర్కింగ్ పార్ట్నర్‌ని గాను, స్లీపింగ్ పార్ట్నర్‌ని. అలాగని కళ్ళుమూసుకుని లేను. ప్రజల డబ్బుతో లావాదేవీలు జరిపే వ్యక్తులు నీతిబాహ్యంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే వికృత పరిణామాలేర్పడతాయి. నాథ్ పైన నాకు మొదట్నుంచీ అనుమానాలున్నాయి. కానీ రూఢిచేసుకోలేక పోతున్నాను. చెప్పేడు మాటలే తప్ప రుజువులు దొరకడలేదు. చివరికి అతని మొహం మీదే అడిగేశాను. మందలించాను. కాల్‌గర్ల్స్‌తో సావాసాలు మంచిదికాదు, బ్లాక్ మెయిల్‌లో ఇరుక్కుంటావని. నవ్వి నన్ను హేళన చేశాడు. ఇలాంటి అబద్ధపు ఆరోపణలు మళ్లెప్పుడైనా చేస్తే కోర్టుకు లాగుతానని హెచ్చరించాడు.

"దాంతో నా పట్టుదల పెరిగింది. ఎలాగైనా అతని చీకటి బ్రతుకు రుజువుచేసి కిక్ ఇవ్వాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. ఈ మధ్యే నాకు కొత్తగా తెలిసింది ఆఫీసులో నీల అనే ఉద్యోగిని రహస్యంగా కలుసుకుంటున్నాడని. ఎక్కడో తెలియదు. ఒకరోజు ఆమె ఇంటికి హఠాద్దర్శనం చేసుకున్నాను....ఏం చెప్పను! ఆమె దర్జా చూసి అదిరిపోయాను. ఇంటినిండా విలువైన సామగ్రి! ఆమె విలాస జీవితం చూసి మతిపోయింది. అవన్నీ ఆమెకెలా వచ్చాయి? ఉద్యోగంలో చేరిన సంవత్సరం—కేవలం ఒక్క సంవత్సరంలో సంపాదించేసిందా?"

"ప్రొసీడ్!"

"దీన్నిబట్టి మీ కేమర్థమవుతోంది? అవన్నీ నాథ్ సమర్పించుకొన్న కానుకలు! అప్పటినుంచీ వెయ్యి కళ్ళతో కనిపెట్టసాగాను. ఆ ఇద్దర్నీ అదనుచూసి రెడ్ హాండెడ్‌గా పట్టుకుంటే ఇంకేం రుజువు కావాలి. ఆమె ఒక్కరేకాదు, ఇంకా చాలామందితో వ్యవహారాలున్నాయట. ఒక్కటి గనుక రుజువైతే కంపెనీనుంచి వెదొలగాలనుకొంటున్నాను."

"ఎందువల్ల?"

"నేను వైదొలగితే అగ్రిమెంట్ ప్రకారం తక్షణం డబ్బు రావడం కల్ల! అందువల్ల అతని భాగంకంటే మరికొంత ఎక్కువ నేనే ఎదురిచ్చి క్లోజ్ షాట్‌లో కిక్ ఇస్తాను."

"మంచిది. అయితే ఇక్కడెందుకొచ్చారు?"

"నిన్నేదో గొడవ జరిగిందని—అనితపట్ల అతడు అమర్యాదగా ప్రవర్తించాడని తెలిసింది. వివరాలు తెలియవు. అతనేం చేశాడు? ఇప్పుడేం జరుగుతోంది? అతన్ని కిక్ ఇచ్చే అవకాశం నాకిప్పుడు కల్పించండి!"

"అయాం వెరీ సారీ, మీ కోరిక తీర్చలేం. అతను మా క్లయంట్. మేం డబుల్ డీలింగ్ చేయలేం."

అతను కోపంగా చూసి అనిత వంక తిరిగాడు.

"నాతో ఎందుకు చెప్పలేదు నువ్వు?"

"సారీ సర్. మీతో ఎక్కువ పరిచయంలేదు."

"ఇప్పుడు చెప్పు! అతనేం చేశాడు? కమాన్!"

"సారీ సర్. నే నేమీ చెప్పదలచలేదు. జరిగిందంతా మర్చిపోవాలనుకొంటున్నాను. నన్నింకా మీ గొడవల్లో ఇరికించకండి, దూరంగా ఉండనివ్వండి. మరోచోట

ఉద్యోగం చూసుకుంటాను."

పాటిల్ విసురుగా లేచాడు, "ఆల్ రైట్ జంటిల్ మెన్! అలాగే! నేను చూసుకుంటాను. అంతా తెలుసుకొని అతన్ని కిక్ ఇస్తాను... ఐయామ్ గోయింగ్ టు ఫినిష్ హిమ్! దటీజ్ మై వర్డ్."

తటాలున తిరిగి అతను బయటకెళ్ళి పోయాడు.

"ఉష్ష్...." అన్నాడు జాన్ పేపరు విసురుకొంటూ.

"వెల్, వెళ్ళి మూసీలో దూకమను!" అన్నాడు లాల్.

"ఇప్పుడేం జరుగుతుంది?" అడిగింది అనిత ఆతృతగా.

"మంచి జరుగుతుంది. నాథ్ కి మీ చెల్లెలికంటే ముందు ఇతను బుద్ధి చెప్పేలా వున్నాడు."

"రామ రామా!"

"అరె, అదేమిటి?"

"నా తల తిరుగుతోంది!"

"ఇంటికెళ్ళిపోండి! తల నెప్పిగావుంటే ఆస్ప్రో వేసుకోండి. ఆపైన నిశ్చింతగా నిద్రపోండి."

"మరి.... రాగిణి?"

"ఆమెని జాన్ ట్రాప్ చేస్తాడు. పాటిల్ శపథం విన్నారుగా? అది విన్పిస్తే ఆమె చల్లబడుతుంది__బడ వచ్చు. మీరేమీ దిగులు పడకండి.

"వెల్, జాన్. ఆమెనెలా ట్రాప్ చేయాలో నీకు తెలుసు. నాథ్ కు పాటిల్ గురించి చెప్పు. కాని అతన్నుంచి రక్షణకొరకు హామీ ఇవ్వకు. కమిట్ అవకు. నాథ్ కి శాస్తి జరగాలి! వ్యక్తిగతంగా నా కతనిపైన సద్భావంలేదు. ఆడవాళ్ళంతా ఒకే రకం అనుకొనే అతనికి గుణపాఠం కావాలి!

"వెల్ అనిత, మీరిక ఇంటి కెళ్ళండి. జాన్ డ్రాప్ చేస్తాడు."

అనిత తలూపి లేచింది; జాన్‌తో బయటికి అడుగు లేసింది.

6

రాత్రి 8 గంటలకి క్రైంబ్రాంచ్ డిటెక్టివ్ బాల కృష్ణన్‌నుంచి ఫోన్ వచ్చింది.

"హలో, మిస్టర్ లాల్. మా క్రైంచార్టులో మరో మర్డర్ పెరిగింది."

"అలాగా....ఎవరిది" లాల్ అన్నాడు నవ్వుతూ.

"ఓ ఫైనాన్సర్‌ది. పేరు మహేంద్రనాథ్."

"మహేంద్రనాథ్! ఏ మహేంద్రనాథ్, కృష్ణన్?"

"జూబ్లీ క్రెడిట్ కార్పొరేషన్ పార్టనర్. నేనిప్పుడు హత్యాస్థలంలోనే వున్నాను. ఇందులో మీ కాసక్తి వుంటుందేమోనని...."

"నా కాసక్తి?....ఈ కేసు మాది! నాకతని గురించి, అతని పూర్తి వ్యవహారం తెలుసు!"

"ఐ.సీ...."

"ఆశ్చర్యంగావుంది....ఎలా జరిగింది? జాన్ అక్కడ వున్నాడా?"

"ఇక్కడ లేడు. హత్య హోటల్ మయూర్‌లో జరిగింది. చివరి అంతస్తులో అతని గదిముందు. గుమ్మం దగ్గర శవం వుంది. గుండెలో కత్తి దిగివుంది. అదృష్ట మేమిటంటే హంతకురాలు దొరికిపోయింది!"

"హంతకురాలా! దొరికిపోయిందా?"

"అవును. పారిపోతూ పట్టుబడింది. అంతా ఒప్పుకుంది. పేరు రాగిణి."

"రాగిణి! డట్ డామ్ స్టుపిడ్ గర్ల్!" అరిచాడు లాల్ ఉద్రేకంగా.

"ఓహ్, ఆమె కూడా తెలుసా మీకు?"

"కృష్ణన్, నేను వెంటనే వస్తాను. జాన్ ఎక్కడ వున్నట్లు...." లాల్ రిసీవర్ పెట్టేసి లేచాడు. ఏదో తోచి గబగబా నాథ్ ఆఫీసుకి డయల్ చేశాడు. కానీ రెస్పాన్స్ లేదు. అవతల ఎంగేజిలోవుంది.

అసహనంగా రెండు నిమిషాలు పచార్లు చేసి తిరిగి డయల్ చేశాడు. అప్పుడూ ఎంగేజిలో నే వుంది. చేతిలో సిగరెట్ అంచుని తీక్షణంగా చూస్తూండిపోయాడు కొన్ని క్షణాలు....ఉన్నట్టుండి ఉలిక్కిపడి సిగరెట్ విసిరేసి టేబిల్ సొరుగులాగాడు. అందులోంచి పెద్ద తాళాల గుత్తితీసి వేగంగా నడిచాడు తలుపు దగ్గరకి.

అప్పుడే ఫోను మ్రోగింది—

వెనక్కి దూకి వచ్చి రిసీవరెత్తాడు.

"యస్, హలో....ఎవరిది?"

"నేను మిసెస్ మహేంద్రనాథ్ ని. ఆయన అక్కడ వున్నారా?"

లాల్ పూర్తిగా తేరుకొని జాగ్రత్తపడ్డాడు. "మీరెక్కడనించి మాట్లాడుతున్నారు?"

"మా ఇంటినుంచి."

"ఆయన ఇంటికి రాలేదా?"

"మధ్యాహ్నం భోజనానికొచ్చి వెళ్ళారు, అంతే."

"ఆయనిక్కడ వుంటారని ఎందుకనుకున్నారు? మీరెవరితో మాట్లాడుతున్నారు?"

"డిటెక్టివ్ కాంతిలాల్ తో, కదూ? ఆయనిక్కడుండవచ్చని పాటిల్—ఆయన పార్టనర్ చెప్పారు.

అంతకుముందు రెండుసార్లు ఫోన్ చేశారట— నేను లేను."

"ఎక్కడికెళ్ళారు?"

"షాపింగ్ కెళ్ళి ఇప్పుడే వచ్చాను. ఫోన్ వచ్చింది పాటిల్ నుంచి. ఆఫీసుకి ఫోన్ చేస్తే రెస్పాన్స్ లేదట. మీ దగ్గరికొచ్చారేమో కనుక్కోమన్నారు."

"మీరు ఆఫీసుకి ఫోన్ చేశారా?"

"లేదు, పాటిల్ చెప్పారు. రెస్పాన్స్ లేదు, ఆఫీసు మూసివుందని."

"మీవారితో ఏం పనో చెప్పాడా?"

"లేదు. ఆయనెక్కడున్నారింతకీ?"

లాల్ తటపటాయించాడు. "సారీ, మాడమ్. నే నిప్పుడు తొందర్లో వున్నాను...." అంటూ ఫోన్ పెట్టేసి బయటకురికాడు.

ఆఫీసు మూసేసి క్రిందికొచ్చి కారెక్కాడు. వేగంగా డ్రైవ్ చేసి నాథ్ ఆఫీసుకి చేరుకున్నాడు. కారిడార్ నిర్జనంగా వుంది. ఆఫీసుకి తాళం వుంది. అతను ఓ క్షణం సందేహించి మారుతాళాలు తీశాడు. తలుపు నెట్టి, చటుక్కున లోనికెళ్ళాడు. చీకటిగావుంది. ఏమీ కన్పించడంలేదు.

మరికొంత ముందుకెళ్ళి "జాన్?" అని పిల్చాడు.

సమాధానంలేదు. అలాగే చీకట్లో కదుల్తూ మళ్ళీ పిల్చాడు. "జాన్!"

అప్పుడూ బదులులేదు.

సిగార్ లైటర్ వెల్గించి లైటు స్విచ్ కోసం వెతికాడు. లైటు వెల్గించి చుట్టూ చూశాడు వేగంగా, ఆత్రుతగా. గదికి కుడివైపు అద్దాల పార్టిషన్ తో నాథ్ ఆఫీసువుంది. పవతలి లైటు అద్దాలగుండా ఆ ఆఫీసులోకి

పడుతోంది. లాల్ దృష్టి టేబిల్ మీద పడింది. అత న్నేమీ ఆకర్షించలేదు, టెలిఫోన్ తప్ప. అది స్థాన భ్రంశం చెంది క్రింద వ్రేలాడుతోంది.

వెంటనే డోర్ తీసి లోనికెళ్ళాడు.

నేలమీద జాన్ బోర్లా పడివున్నాడు.

లాల్ తటాలున అక్కడ కూర్చొని నాడీ చూశాడు.

"జాన్.... లే!"

జాన్ కదల్లేదు. లాల్ మళ్ళీ తట్టాడు. కుదిపేశాడు. "కమాన్, జాన్, గెటప్! ఎవరైనా చూస్తే, పరువు పోతుంది...."

లాల్ లేచి గ్లాసులో నీళ్ళందుకొని ముఖంమీద కొట్టాడు. జాన్ కదిలాడు. చిన్నగా కదిలి మూల్గాడు. కళ్ళు తెరిచి, ఒళ్ళు విరుచుకుంటూ లేచి కూర్చున్నాడు.

"నేను .... నేనెక్కడ — ఎవరది? లాల్ నువ్విక్కడ....?"

"నీకోసమే వచ్చాను, గెటప్!"

"ఎలా వచ్చావు? అరె భాయ్, మహేంద్రనాథ్ ఎక్కడ?"

"మహేంద్రనాథ్ చచ్చాడు."

"గాడ్! ఏమిటి నువ్వనేది?"

"కృష్ణన్ ఫోన్ చేశాడు, హోటల్ మయూర్‌లో నాథ్ హత్య జరిగింది. రాగిణి చంపిందట—కత్తితో అక్కడే పట్టుబడింది. నాథ్ అక్కడికెలా వెళ్ళాడో అంతుబట్టలేదు. నువ్వక్కడ లేవని కృష్ణన్ చెప్పాడు. అయితే నాథ్ ఒంటరిగా వెళ్ళాడనుకున్నాను. నీ కేదో సాకు చెప్పి, లేదా మాయచేసి వదిలించుకున్నా డను కున్నాను. కాని నువ్విక్కడుంటావని ఫోన్ చేస్తే

రెస్పాన్స్ లేదు. ఎంగేజిలో వుంది. రెండు నిమిషాలు ఆగి చేసినా ఫోన్ ఎంగేజిలోనే వుంది.

నా కనుమానం వేసింది. ఇక్కడేదో జరిగింది—ఫోన్ ఎంగేజిలో వుండటం కాదు, ఇంత రాత్రి ఆఫీసు మూసి వుంటుంది, అది స్థానభ్రంశం చెందివుండాలనుకున్నాను. అర్జంటుగా నాథ్ ఎక్కడికో వెళ్ళవల్సివచ్చి నిన్ను వదిలించుకొనే ప్రయత్నంలో చిన్నపాటి ఘర్షణ జరిగిందనిపించింది....నువ్విక్కడ బంధించబడో, స్పృహ తప్పో వుంటావనుకుని స్కెలిటన్ కీస్‌తో బయలుదేరి వస్తే—"

"ఓహ్, లాల్! అతను నా తల పగలగొట్టేశాడనిపించింది!"

"ఎందుకలా చేశాడు?"

"మేమిద్దరం మాట్లాడుకుంటున్నాం. ఇంతలో 7 గంటలకనుకుంటాను, ఫోన్ మోగింది. అవతలి మాటలతన్ని కంగారుపెట్టాయి. నాముందు ఏమీ మాట్లాడలేకపోయాడు. వెంటనే వస్తున్నానని చెప్పి, రిసీవర్ విసిరికొట్టి లేచాడు. నన్నిక్కడే వుండమని చెప్పి బయటికి నడిచాడు. నేను వెంబడించాను. అతను వారించాడు. నేను బాడీగార్డ్‌నన్న సంగతి గుర్తు చేశాను. కానీ వినిపించుకోలేదు. చాలా పర్సనల్ అని చెప్పి రావద్దని అర్చాడు. నేను మొండిగా వెళ్ళబోయాను.

"అప్పుడతను వేగంగా తిరిగివచ్చి టేబిల్ మీద ఆ పేపర్ వెయిట్ అంగుకుని టపటపమని కొట్టేశాడు నెత్తిమీద. ఆ క్షణంలో ఏం జరుగుతోందో నాకసలు తెలియలేదు!...."

"నీ మెదడు బాగా తిమ్మిరెక్కి వుంటుంది, ఇక్కడ

పనిలేకుండా కూర్చుంటే!" కసిరాడు లాల్. "కమాన్. అక్కడికి చేరుకోవాలి త్వరగా!"

7

కృష్ణన్ డిటెక్టివ్‌లని విష్ చేశాడు. "ఫ్రెండ్స్, అతనే మీ క్లయింట్."

డిటెక్టివ్‌లు చూశారు. మహేంద్రనాథ్ గది ద్వారం దగ్గర, గడపమీద వెల్లకిలా పడివున్నాడు. సగం దేహం గదిలోపల, సగం దేహం నడవలో. తల గదిలోవుంది. గుండెలో బాకు పిడివరకూ దిగివుంది.... అతని ఒంటిమీద తెల్లషర్టు, నల్లపాంటు వున్నాయి. కాళ్ళకి బూట్స్. షర్టు ఎర్రబడింది. రక్తం క్రింద మడుగుకట్టింది.

నిపుణులు గదిలోపలా, శవందగ్గర బిజీగా ఉన్నారు.

ఆ గది కారిడార్‌లో చివర్న వుంది. గది ప్రక్క నుంచి క్రింది అంతస్తుకి మెట్లున్నాయి. లిఫ్ట్ సౌకర్యం వేరే వుంది. మెట్లకి కొంచెం ఇవతల కుర్చీల్లో రాగిణి, మరో యువతి, ఒక ఇన్స్‌పెక్టర్ వున్నారు. వాళ్ళ ప్రక్కన రూం బాయ్ నిల్చున్నాడు.

డిటెక్టివ్‌లు వాళ్ళని సమీపించారు. రాగిణి ముఖం పాలిపోయి, కళావిహీనంగావుంది. ఆమె పెదవులు బిగబట్టి బిగుసుకుపోయి కూర్చునుంది. ఆమె ప్రక్కన యువతిని జాన్ ఆశ్చర్యంగా చూశాడు. "మీరు మిస్ నీల కదూ?"

ఆమె తలూపింది చటుక్కున.

"మిమ్మల్ని నాథ్ ఆఫీసులో చూశాను. మీరక్కడ పనిచేస్తారు."

"మళ్ళీ తలూపిందామె.

లాల్ అన్నాడు కర్కశంగా, "రాగిణీ, ఇప్పుడెలా

వుంది? నీ పగ చల్లారిందా?"

"నే ననుకొన్న దెప్పుడూ జరక్కుండా వుండలేదు."

"జైలుకెళ్తానన్నదానివి, పారిపోవడానికెందుకు ప్రయత్నించావు?"

"ప్రతిదీ నేను చాలెంజ్ చేస్తాను. పోలీసులు నన్ను వెంటాడి, వేటాడి పట్టుకుంటేనే నాకు తృప్తి."

"ఎంత తేలిగ్గా మాట్లాడేస్తున్నావు! ఉదయంనుంచి ఎక్కడవున్నావు?"

"అతన్ని కనిపెడ్తున్నాను. ఆఫీసు కెదురుగా మూడంతస్తుల హోటల్ వుంది. పై అంతస్థులో గదితీసుకొని గమనిస్తున్నాను. మధ్యాహ్నం బయటకొస్తే వెంటాడాను. అక్కయ్య దగ్గర కెళ్తాడనుకున్నాను. కానీ ఇంటికెళ్ళి భోంచేసి వచ్చాడు. సాయంత్రం 7 గంటల వరకూ ఆఫీసులోనే ఉన్నాడు. నేను కనిపెడ్తూనే వున్నాను. ఈయన రెండుమూడుసార్లు బయటకొచ్చి తిరగడం చూశాను" జాన్ని చూపిస్తూ అందామె.

"ఆయన డిటెక్టివని నాకు తెలియదప్పుడు. మహేంద్రనాథ్ 7 గంటలవరకు ఆఫీసు కదల్లేదు. నా హెచ్చరిక పాటించలేదు. అప్పటికి గడువు దాటిపోయింది. ఆఫీసు కెళ్ళి పొడి చెయ్యాలనుకున్నాను. నా దగ్గర కత్తివుంది. అతని గుండెలో చూశారా? దాన్ని ప్రత్యేకంగా ఈ పనికే కొన్నాను.

"సరే, అప్పుడు 7 దాటింది. అతను హడావిడిగా బయటికొచ్చి కారెక్కి బయలుదేరాడు. వెంట ఈ డిటెక్టివ్ లేరు. ఎవరూ లేరు. నేను ఆటోలో వెంటాడాను. కానీ నాకూ అతనికీ మధ్య ఒక కారు మాటిమాటికీ అడ్డువచ్చి విసిగించింది దారి పొడుగునా. నాథ్

తప్పిపోతాడనుకున్నాను.

"ఆ మధ్య వచ్చిన కారు హోటలు దగ్గర ఎటో మాయమైంది. అది గ్రీన్ అంబాసిడర్. అలా అడ్డు వస్తున్నందుకు ముందు దాని డ్రైవర్‌ని పొడవాలనుకున్నాను. నాథ్ అప్పుడూ అక్కయ్య దగ్గరకెళ్ళి క్షమాపణ చెప్పుకోలేదు. ఇక్కడికొచ్చాడు. నేనీ గది వరకూ జాగ్రత్తగా వెంబడించాను. అసలు నా హెచ్చరికనూ, నన్నూ మర్చిపోయినట్లు కన్పించాడు - అతని వాలకం చూస్తే. అంత కంగారుగా—కాదు—కసిగా, ఆవేశంగా కన్పించాడు. గదిలో ఏవో అరుపులు విన్పించాయి. నేను బయట బెల్లు నొక్కాను. అరుపులాగిపోయి తలుపు తెరుచుకుంది. గుమ్మంలో నిలబడి నన్ను గాభరాగా చూశాడు. తెరుచుకునే లోపున కత్తిలాగి పొడిచేశాను.

అంతే! అతను అరవలేదు. చిన్నగా మూల్గాడు. మూల్గి క్రిందపడ్డాడు. నేనక్కడనుంచి మెట్ల దగ్గర ఉరికాను. అప్పుడే ఈ వెయిటర్ శనిలా దాపురించాడు! వెనకనుండి వెంటాడి నన్ను మెట్లమీద పట్టుకున్నాడు. కేకవేశాడు. అంతే, ఇంకేముంది?"

లాల్ ఆమె కళ్ళలోకి పరీక్షగా చూసి వెయిటర్ వైపు తిరిగాడు.

"అవును సార్, ఆమె చెప్పింది నిజం. ఆమె పొడుస్తున్నప్పుడు నేను ఆ చివర వున్నాను—అప్పుడే యిటు వస్తున్నాను. కళ్ళారా చూశాను."

జాన్ కళ్ళు నీలమీద పడ్డాయి, "కానీ మీరిక్కడికెలా వచ్చారు? నాథ్‌ని యెందుకు పిలిచారు?"

"మేం తరచు ఇక్కడ కలుసుకొంటుంటాం. ఇది

అతని పర్మనెంట్ గది. నాకో డూప్లికేట్ కీ చేయించి ఇచ్చాడు, హోటలురూమ్సుకి విరుద్ధమైనా. నే నాఫీసులో ఆరుగంటల వరకున్నాను. మీరు మధ్యాహ్నంనుంచి అక్కడే వున్నారు. ఎందుకో నా కర్థంకాలేదు. కానీ మిమ్మల్ని గుర్తుపట్టాను. ఆఫీసు వదిలేక తిన్నగా ఇక్కడి కొచ్చాను. స్నానం అదీ అయ్యాక ఏడుగంటలకి అతనికి ఫోన్ చేశాను రమ్మని, ఎప్పటిలాగే. కానీ అతనంత కోపంగా, ఆవేశంగా వచ్చి తిడతాడనుకోలేదు!"

"ఎందుకు తిట్టాడు?"

"ఆయన పార్ట్‌నర్ ఆఫీసులో అందర్నీ గమనిస్తున్నాడట. నన్నిక్కడ పట్టుకుంటే తన వ్యవహారమంతా బైట పడుతుందని తిట్టాడు. ఇకపైన ఇక్కడ అసలు రావద్దని అన్నాడు. స్థలం మారుస్తానని చెప్పాడు."

"అప్పుడు?"

"అలా అరుస్తున్నప్పుడే కాలింగ్ బెల్లు మ్రోగింది. పాటిల్ వచ్చేశాడని కంగారుపడ్డాడు. కానీ బయట గాజులశబ్దం విని వెంటనే తలుపుతీశాడు. అంతే—అప్పుడీమె మాటమాత్రం లేకుండా పొడిచి పారిపోయింది!"

రాగిణి చివాల్న తలతిప్పి నీలను అసహ్యంగాచూసింది.

"అలా స్పష్టంగా చూశారా?"

"స్పష్టంగా చూశాను. ఒకే ఒక్క పోటు బలంగా పొడిచింది."

లాల్ ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగాడు: "మీరేం చెయ్యదల్చుకున్నారు?"

"ఈ ముగ్గుర్నీ స్టేషన్‌కి తీసికెళ్తాం. అక్కడ స్టేట్‌మెంట్స్ తీసుకుని వీళ్ళిద్దర్నీ వదిలేస్తాం. రాగిణి కస్టడీలో వుంటుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

8

మర్నాడు అనిత లాల్ ఆఫీసుకొచ్చి ఏడ్చింది, బ్రతిమాలింది; చెల్లెల్ని రక్షించమని. నగలు వొలిచి చేతిలో పెట్టింది. ఎలాగయినా ఆమెను కాపాడమని ప్రాధేయపడింది.

కానీ ఏ ఆధారంతో ఆమెని విడిపించగలరు, తాను చంపానని స్వయంగా చెప్పుకుంటుంటే? ఆమె స్టేట్ మెంటుకి తగట్టు ఆధారాలున్నాయి, సాక్షులు కూడా వున్నారు. డిటెక్టివ్‌లు తమ నిస్సహాయతను వెల్లడించారు. సానుభూతి చూపడంకంటే చెయ్యగల్గిందేమీ లేదన్నారు. ఈ వార్త తక్షణం పెద్దలకు తెలియజేసి, లాయర్ సహాయాన్ని పొందటమే ప్రస్తుత కర్తవ్యమని చెప్పారు.

అనిత దాదాపు స్పృహలేని స్థితిలో తూలుతూ వెళ్ళిపోయింది.

అయితే డిటెక్టివ్‌లు చెరొకరికి మెదడులో ఏదో మూల మాటల్లో పెట్టలేనిదేదో తొలుస్తూనే వుంది— రాత్రినుంచి. దాన్ని పరస్పరం వెల్లడిచేసుకొని రూఢీ చేసుకొనే ప్రయత్నం చెయ్యలేకపోతున్నారు — జరిగిన హత్యను ఓపెన్ & షట్ కేసులా తేల్చేసిన రాగిణి స్టేట్ మెంట్ విని.

పరిస్థితి ఇలావుండగా మధ్యాహ్నం ఒంటిగంటకు నాథ్ పార్ట్‌నర్ పాటిల్ దుమారంలా వచ్చి, పెద్దగొంతుకతో చిన్న ఉపన్యాసమిచ్చాడు :

"జంటిల్మన్! క్రితంసారి వచ్చినప్పుడు నేనేంచెప్పాను. నా ఆందోళన ఏమిటి? కంపెనీ ప్రతిష్ఠగురించి నేనెంత ప్రాకులాడాను. నిద్రకాచాను. ఆరోగ్యం పాడుచేసుకున్నాను. అవినీతిని నిరోధించాలని కాయశక్తులా శ్రమిం

చాను. ఫలితం? నా శ్రమంతా బూడిదలోపోసిన పన్నీరయింది! కంపెనీ ప్రతిష్ట పత్రికల కెక్కింది. ప్రజల్లో ప్రెస్టేజి, విశ్వాసం కోల్పోయింది! నా పార్ట్‌నర్‌నీ కంపెనీ ఉద్యోగినీ 'ఛీ—అవ్వ!' అనుకునేలా హెడ్డింగ్ పెట్టి వ్రాశాయి! ఏం కాను! ఇప్పుడు కంపెనీ గతి ఏం కాను!"

"టు హెల్ విత్ యువర్ బిజినెస్!" కసురుకున్నాడు లాల్.

"ఏమిటీ?"

"ప్లీజ్, మీరలా ఆవేశపడకండి." జాన్ కల్పించుకున్నాడు.

"ఇదంతా మీవల్లనే జరిగింది!" అర్చాడతను.

"వాట్ నాన్సెన్స్! ఏమిటి మీ దబాయింపు?" కోపంగా అన్నాడు లాల్.

అప్పుడే ఫోన్ మ్రోగటంతో జాన్ రిసీవరెత్తాడు.

"నాథ్ మొన్న ఏంచేశాడో మీరు చెప్పలేదు!" అన్నాడు పాటిల్. "అతని భార్యకూడా చెప్పడానికొప్పుకోలేదు. అనిత ఏం చెప్పిందో మీకు తెలుసు. నాథ్ చేసిందేవిటో నాకు తెలిస్తే ఈ గొడవని గుట్టు చప్పుడుకాకుండా పరిష్కరించేవాడ్ని. కంపెనీ గుడ్‌విల్ని అలా కాపాడేవాడ్ని."

"ఎవరో చెప్పలేదంటే మేమేం చెయ్యాలి? మేం చెప్పటమన్నది క్లయింట్ విశ్వాసాన్ని భంగపర్చినట్లు అవుతుంది."

"పోనీ, అంతటి విశ్వాసంతో అతనికేం మేలు చేశారు? హత్యని నివారించలేకపోయారు? మీ అసమర్థతవల్ల బండారమంతా బయట—" పాటిల్ ఆగిపోయి

ఫోన్‌లో మాట్లాడుతోన్న జాన్‌ని తీక్షణంగా చూశాడు.

"అలాగా?.... ఈ కేసులో మలుపా?" అంటున్నాడు జాన్, "వెరీవెల్! ఈ కేసు నాకసలు నచ్చలేదు. ఏదో విచిత్రం జరిగి విడిపోవాలని జీసెస్ క్రైస్ట్‌ని ప్రార్థిస్తున్నాను ఇంతదాకా.... ఈ మలుపుని ఆహ్వానిస్తున్నాను కృష్ణన్. అసలు మలుపులేనిదేమిటి? మలుపులేకుండా ప్రయాణం సాగదు. మలుపు లేకపోతే పరిశోధన సాగదు...."

లాల్ పాటిల్ని చూశాడు. "మిస్టర్ పాటిల్, ఇంతకీ మీరే ఉద్దేశంతో వచ్చారిక్కడికి? ఏమిటి పేచీ?"

"నాకు మనస్తాపం కల్గించిన వాళ్ళని చెడామడా తిట్టేయడం నా అలవాటు" అనేసి గిరుక్కున తిరిగి వేగంగా తలుపు దగ్గరికి నడిచాడు అతను.

లాల్ గబుక్కున ముందుకి వంగాడు. "జస్ట్ మినిట్! ఆగండి, మిస్టర్ పాటిల్."

అతను వెనక్కి తిరిగి కోపంగా చూశాడు. "ఏమిటి?"

"నిన్న సాయంత్రం మీరెక్కడున్నారు?"

"ఈ ప్రశ్న దేనికి వేశారు?"

"మేం మీ పార్ట్‌నర్ మాత్యూని పరిశోధిస్తున్నాం."

"ఇంకా పరిశోధన ఏమిటి? అంతా ఆమె ఒప్పుకుందిగా?"

"ఆమె ఒప్పుకోలేదు, పరిస్థితులు ఆమెని ఒప్పించాయి."

"ఐసీ.... ఐ పిటీ హర్, నా సానుభూతి తెలపండి."

"నిన్న సాయంత్రం 7 నుంచి 8 వరకు మీరెక్కడున్నారు?" రెట్టించాడు లాల్.

జాన్ ఫోన్ పెట్టేసి అయోమయంగా చూశాడు.

"ఆల్రైట్. ఆరు తర్వాతనుంచీ ఇంట్లోనే వున్నాను. చాలా?"

"రుజువు చెయ్యగలరా?"

"చెయ్యలేను. ఒంటరిగాడ్ని. ఇంట్లో ఎవరూ లేరు."

"అది రుజువుచెయ్యడం చాలా అవసరం."

"మీరు నన్ననుమానిస్తున్నారా? చింతిస్తారు మై డియర్ —"

"నిన్న సాయంత్రం మిసెస్ నాథ్ కెందుకు ఫోన్ చేశారు?"

ఈ ప్రశ్నకి అతను కలవరపడ్డాడు. వెంటనే తడుట పడి, "మిసెస్ నాథ్ కి చేయలేదు, నాథ్ ఇంటికి చేశాను. ఆమె పలికింది" అన్నాడు.

"దేనికి చేశారు?"

"నాథ్ కోసం. కానీ అక్కడ లేడు. మీ ఆఫీసులో ఉన్నాడేమో కనుక్కోమన్నాను. ఆమె మీకు ఫోన్ చేసి, లేడని నాకు తెలియజేసింది."

"మాకు స్వయంగా మీరే ఎందుకు చెయ్యలేక పోయారు?"

"ఎందుకా? మీరతని రహస్యాల్ని భద్రంగా కాపాడు తున్నారనీ!"

"నాథ్ ఇంటికెన్ని గంటలకి ఫోన్ చేశారు?"

"ఆరున్నరనుంచి ఎనిమిది వరకు మూడుసార్లు చేశాను. మొదటి రెండుసార్లు పిల్లలు పలికారు. మమ్మీ షాపింగ్ కెళ్ళిందన్నారు. కానీ ఆమె షాపింగ్ కెళ్ళగా నేనెప్పుడూ చూడలేదు. ఆమె అసలు ఇల్లు కదలదు. మూడోసారి ఎనిమిది గంటలకి ఫోన్ చేశాను. అప్పుడామె పలికింది."

"రెండోసారి ఎన్ని గంటలకి చేశారు?"

"ఏడున్నరకి—అప్పుడూ పిల్లలు పలికారు."

"నాథ్‌తో ఏం మాట్లాడాలనుకున్నారసలు?"

"పార్టనర్‌షిప్ గురించి. అతని చీకటి బ్రతుకు గురించి నా కనవసరమనుకున్నాను. అతని భాగంకంటే ఎక్కువ డబ్బిచ్చి వదిలించుకోవాలనుకున్నాను. ఆ విషయాలన్నీ మాట్లాడుకునేందుకు ఇంటికి రమ్మనాలనుకున్నాను. కానీ అతనెక్కడా లభించలేదు."

"ఆఫీసుకి ఫోన్ చెయ్యలేదా?"

"చేశాను. ఆఫీసు అయిదు గంటలకే మూసేస్తారు. అందువల్ల ఇంటికే చేశాను మొదట. కానీ ఇంట్లో లేకపోవడంతో అప్పుడాఫీసుకి ఫోన్ చేశాను."

"ఎన్ని గంటలకి? వెంటనే చేశారా?"

"లేదు. ఇంటికి ఆరున్నరకి చేశాను. అక్కడలేకపోతే ఎక్కడ వెళ్ళివుంటాడా అని ఆలోచించాను. ఒకవేళ పని ఎక్కువవుండి ఆఫీసులోనే ఉండిపోయాడేమోనని చాలాసేపటి తర్వాత తట్టింది. ఏడుదాటిందనుకుంటాను, అప్పుడు ఫోన్‌చేశాను. కానీ రెస్పాన్స్‌లేదు, నిజంగానే ఆఫీసు మూసివుంది."

"రెస్పాన్స్ లేదా....? అంటే?"

అతను కోపంగా చూశాడు. "అంటే?....అంటే ఏమిటి!"

"రెస్పాన్స్ లేదంటే అర్థమేమిటి?"

అతని ముఖం కందిపోయింది. "అర్థంలేని ప్రశ్నలు వేస్తున్నారు! రెస్పాన్స్ లేదంటే అర్థమేమివుంటుంది?"

లాల్ జాన్ వైపు తిరిగాడు. "ఏమైవుంటుంది పార్టనర్?"

జాన్ అయోమయంలోంచి తేరుకొని, "అవతల ఎవరూ

లేరనా?" అన్నాడు.

"ఓహ్, అవును! మరింకేమిటనుకున్నారు?" అరిచాడు పాటిల్.

"అవతల ఎవరైనా వుంటే ఫోన్ ఎత్తకపోయినా రెస్పాన్స్ రాదు" జాన్ అన్నాడు మళ్ళీ.

పాటిల్ కలవరపడ్డాడు.

జాన్ ఇంకా ఉత్సాహంగా అన్నాడు అతని కలవరం చూసి. "అవతల ఫోన్ ఎంగేజిలో వున్నా రెస్పాన్స్ రాదు—నెంబర్ త్రీ! చెప్పండి, ఈ మూడింట్లో ఏది కావచ్చు?"

"ఏమిటి మీ ఉద్దేశం? నా మీద ఏమారోపిస్తున్నారు?" అరిచాడతను.

ఈసారి జాన్ కలవరపడ్డాడు.

లాల్ కల్పించుకున్నాడు, "మీరు ఫోన్ చేసినప్పుడు అవతల ఎంగేజిలో వుందో లేదో బాగా ఆలోచించి చెప్పండి."

"లేదు, ఎంగేజిలో లేదు! అవతల ఎవరూ లేరు!"

"తప్పు. ఎంగేజిలో వుందనుకున్నారు. అంటే నాథ్ ఆఫీసులో వున్నాడనుకున్నారు. వెంటనే బయలుదేరి వచ్చి—"

"వచ్చి? వచ్చి ఏం చేశాను, మీ పిచ్చిగాని!"

"ఆఫీసుముందు నిఘా వేశారు" అన్నాడు లాల్. "ఇంతలో అతను కంగారుగా వచ్చి కారెక్కి బయలుదేరాడు. మీరు వెంబడించారు. అతను హోటలు మయూర్ చేరుకున్నాడు. మీరూ అక్కడికెళ్ళారు.... హత్య సరిగ్గా 7-20 కి జరిగింది....ఆ వెంటనే మీరక్కడ్నుంచి వెళ్ళిపోయి నాథ్ ఇంటికి ఫోన్ చేశారు రెండో

సారి, ఏడున్నరకి. పిల్లలు పలికారు. తర్వాత ఎనిమిది గంటలకి మీ పార్ట్‌నర్ భార్య పలికింది. ఆమెతో మీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని ప్రయత్నించారు. అదంతా ఎలిబీ కోసం మీరు సాగించిన స్టంట్ మాత్రమే!"

"ఓ గాడ్!....హే భగవాన్!....హెల్ప్ మీ!"

"ప్లీజ్ వెళ్ళిపోండి! వెంటనే లాయర్‌ని నియమించుకోండి."

పాటిల్ ఆవేశంగా ముందుకి రాబోయాడు. కానీ మనసు మార్చుకొని, చటుక్కున వెనుదిరిగి అరుస్తూ వెళ్ళిపోయాడు.

9

కృష్ణన్ బ్రీఫ్ కేసుతో రాకెట్‌లా దూసుకొచ్చాడు.

"గుడ్ గాడ్! ఫ్రెండ్స్, పొరపాటు జరిగింది!"

"ఏమిటా పొరపాటు?" లాల్ అడిగాడు.

"మనం అనుకోవడం—రాగిణి హతుడ్ని చంపిందనుకోవడం!"

"మనం అనుకోవడంలేదు—ఆమె చెప్తోంది—కదూ?"

"ఆమె చెప్తున్నదంతా అబద్ధం!"

"వెల్, ఆమెకెందుకేర్పడిందా అగత్యం?"

"ఆమె మోటివ్ మీకే బాగా తెలుసు. ఈ రిపోర్ట్స్ చూడండి...."

"చూసే ఓపిక లేదు, ఫ్లాష్ పాయింట్స్ జిగేలుమన్పించండి."

"ఆల్రైట్, అయితే వినండి: హత్యా సమయం 7-20. కత్తితో జరిగింది. కత్తి గుండెలో పిడివరకూ దిగింది. పిడిమీద రాగిణి వేలిముద్రలు వున్నాయి. శవభంగిమ

దాడి జరిపిన విధానానికి అనుగుణంగా వుంది. అతను తలుపు తీసిన వెంటనే ఆమె పొడిచింది ముందునుంచి—అప్పుడతను వెల్లకిలా వెనక్కిపడ్డాడు గదిలో. కాని కాళ్ళు బయట కారిడార్‌లో వున్నాయి. అంటే అతను ఎక్కడ నిలబడ్డాడు? గది లోపలా? బయటా?

తలుపు తీసిన తక్షణం పొడిచిందంటే లోపలే వుండాలి. అలా స్పష్టంగా వర్ణిస్తోంది ఆ సమయంలో గదిలో వున్న నీల. కానీ గది బయట కాళ్ళు అతను బయట నిల్చున్నాడని సూచించడంలేదూ?"

జాన్ అన్నాడు: "ఆమెని పట్టుకోనే ప్రయత్నంలో బయటకు జరిగి వుండవచ్చు."

"ఆల్రైట్, అయితే గాయం చూడండి, గుండెలో పైనుంచి ఏటవాలుగా క్రిందికి వుంది. దిశ కుడివేపుగానీ ఎడమవైపుగానీ వంపులేకుండా, సూటిగా క్రిందకివుంది.... లోతు అరంగుళాలు. కత్తికి ఇరువైపులా పదునుంది. చివర మొనదేలి, బ్లేడు అసలు మెరుగు కోల్పోకుండా తళతళ లాడుతోంది. సరిక్రొత్త కత్తి.

"అయితే ఈ గాయం లోపల, పైనుంచి సుమారు అంగుళం లోతులో, అడ్డంగా ఎడమవైపుకి చీలిక ఏర్పడింది. ఈ చీలిక అరంగుళం పొడవుంది. అంటే ఈ చీలిక ప్రధాన గాయానికి అంగుళం దూరం నుంచి లోపల 'Y' ఆకారంలో ఏర్పడిందన్న మాట. అర్థం చేసుకున్నారా?"

డిటెక్టివ్‌లు తలూపారు.

"ఈ ఎక్స్‌రే చూస్తే బాగా అర్థమవుతుంది. గాయం లోకి Radio paque ఇంజెక్షన్ చేసి.... డాక్టర్ ఏదో ప్రక్రియ చెప్పాడు.... ఈ ఎక్స్‌రే తీశాడట. ఇందులో

గాయం స్వరూప స్వభావాలు స్పష్టంగా అర్థమవుతాయి."

డిటెక్టివ్‌లు ఎక్స్‌రేను కిటికీ వెలుతురులో పరిశీలించారు.

"అవును, చీలిక అడ్డంగా స్పష్టంగా కనిపిస్తోంది" జాన్ అన్నాడు.

కృష్ణన్ తలూపాడు. "ఈ చీలిక మితులు లోతు మినహాయిస్తే—పొడవు, వెడల్పు, అడుగు భాగం ఆకృతి మొదలైనవి ప్రధాన గాయం కొలతలతో సరిపోతున్నాయి. అంటే ఈ రెండు గాయాల్నీ ఒకే కత్తి చేసిందన్న మాట."

"ఐ సీ...." లాల్ అన్నాడు.

"ఇప్పుడు చెప్పండి, ఈ చీలిక కర్థమేమిటి? హతుడు రెండు పోట్లు తిన్నాడని కాదూ?"

"అవును, అవును.... కాని, షర్టుమీదా బనియన్‌మీదా ఎన్ని పోట్లున్నాయి?"

"ఒక్కటే."

"వెల్, ఆమె ఒకేచోట రెండుసార్లు పొడిచి వుండవచ్చు" అన్నాడు జాన్.

"నో, ఒక్కసారే పొడిచిందని నిశ్చయంగా అంటోంది నీల! కానీ రాగిణి రెండుసార్లు పొడిచానంటోంది. ఈ ఇద్దరూ అబద్ధమాడుతున్నారు. రాగిణి ఒక్కసారే పొడిచింది. మరోసారి పొడిచే అవకాశం ఆమెకు లేదు! ఈ హత్యలో మరొకరి పాత్ర వుంది."

"వెల్, వెల్, కృష్ణన్! అదెలా?" లాల్ అడిగాడు కళ్ళు పెద్దవిచేసి.

"అదెలా జరిగిందం—తలుపు తీసిన వెంటనే రాగిణి

పొడిచింది. అది వాస్తవమే. అయితే ఆ పోటు సూటిగా సరిగా దిగలేదు. చెయ్యి వణకడం వల్లనో, ఆమెకు బలం లేకనో అడ్డంగా వెళ్ళి గుచ్చుకుంది కత్తి. గుచ్చుకుంది, అంతే. దిగబడలేదు! అది గుండెని గాయపర్చలేదు, ఆ గాయం ప్రాణాంతకమైంది కాదు. ఆమె అక్కడ్నించి పరుగు తీసింది. అప్పుడు బరువయిన, బలిష్టమయిన పిడిగల కత్తి ఆ గాయంలో నిలవలేక జారి క్రింద పడింది—పడుతూ హతుని ఎడమకాలి బూటులోనికి చొచ్చుకు పోయింది. బొటన వేలికీ, రెండో వేలికీ మధ్యలో చర్మం తెగి రక్తం సాక్స్ పీల్చుకుంది—”

“ఓహో! ఇంకా చెప్పండి!” అర్చాడు జాన్ బల్ల మీద కొట్టి.

“అలా పడ్డ కత్తిని అందుకొని మళ్ళీ పొడిచే అవకాశం రాగిణికి లేదు. ఆ పని చేసేంతలో హతుడు ఆమెని నివారించగలడు. కాబట్టి ఆమె మళ్ళీ పొడవలేదు. ఆ పోటు చాలనుకొంది, పారిపోయింది. ఇంతలో అదే క్షణంలో, ఎవరో తెలివిగా అదే కత్తి అందుకొని అదే గాయంలోకి దింపారు. ఫ్రెండ్స్! అలా దింపిన మనిషి హతునికి బాగా తెలిసినవారై వుండాలి. అతని సహాయానికి వచ్చినట్టు వచ్చి పొడిచేశారు. రాగిణి వేలిముద్రలు చెడకుండా జాగ్రత్తగా, ఆమె చేసిన గాయంలోకి, హత్య ఆమెమీద కెళ్ళాలన్న ఆలోచనతో.

“ఇప్పుడు చెప్పండి! ఆ పని ఎవరు చేసి వుంటారు? ఈ హత్యలో ఇద్దరి పాత్ర వుందని తెలిశాక నీల అబద్ధమాడుతోందని స్పష్టమవడం లేదూ? ఈ ఆధారంతో ఆ పని ఆమే చేసిందనిపించడం లేదూ?”

లాల్ నిటారుగా కూర్చుని జాన్ని చూశాడు, మెరు

స్తున్న కళ్ళతో. "వెల్, జాన్! వెళ్ళి అనితని ఓదార్చు! గండం తప్పిందని చెప్పు! గెటవ్ అండ్ మూవ్ ఫాస్ట్. నే నింకా ఆమె నా స్థితిలో చూళ్ళేను."

జాన్ లేచాడు. వేగంగా బయటికి దారి తీశాడు.

లాల్ కృష్ణన్ వైపు తిరిగాడు. "ఇన్‌స్పెక్టర్! మీ లాజిక్ చాలావరకు వాస్తవం కావచ్చు. కానీ రెండో పోటు నీల పొడిచిందనడానికి ఆధారం లేదు."

"ఎందుకు లేదు?"

"అప్పుడామె గది లోపల వుంది. హంతుడు ద్వారాని కడ్డుగా ఆమె వైపు వీపు పెట్టి నిల్చున్నాడు. పోటు తిని ఆవేశంగా వెళ్లికిలా వెనక్కి పడ్డాడు. వెల్, కాళ్ళు బయట వున్నాయి గనుక, రాగిణిని పట్టుకోనే ప్రయత్నంలో బయటకు అడుగు వేశాడనుకుందాం. ఆ అదను చూసుకొని నీల బయటకొచ్చి ముందు నుంచి పొడిచి వుంటే, అప్పుడు మీ లాజిక్ వాస్తవం కావచ్చు. కానీ మరొక చిక్కు వుంది. ఇందులో మరో అనుమానితు డున్నాడు...."

"ఎవరు?"

"హంతుడి పార్ట్‌నర్ పాటిల్. అతను నాథ్‌ని వెంటాడి హోటలు కొచ్చాడు. నాథ్ కారుని ఒక గ్రీన్ అంబాసిడర్ వెంటాడ్డం రాగిణి చూసిందట....ఆ కారు పాటిల్ది. నాథ్‌ని రెడ్ హేండెడ్‌గా లవర్‌తో పట్టుకోవాలని వెళ్ళివుంటాడు. అప్పుడే రాగిణి పొడిచి పారి పోతుండగా చూశాడు. ఆమె వెనుక రూమ్‌బాయ్ వురి కాడు. కారిడార్‌లో మరెవరూ లేరు. కిందపడ్డ కత్తి తీసుకొని ఆ అవకాశంతో పొడిచేశాడు."

"పొడిచేశాడా?"

"వెల్, పొడిచి వుంటాడు. అయితే నీల ఏం చేస్తున్నట్లు? అతన్ని చూశ్శేదా? చూస్తే యెందుకు వూరుకుంది?"

"మీరు సాగదీస్తున్నారు. చిక్కులు సృష్టిస్తున్నారు"

"పలాయనవాదం ఇక్కడ పనికిరాదు. మరో విషయం, రాగిణి పొడిచి వుండదు...."

"ఆఁ!.... బాగుంది. ఆ తర్వాత నాథ్ చావలేదనండి."

"ముందు వినండి. నిజానికి ఆమెకు భయం ఎక్కువ. బాహాటంగా ఎన్ని హెచ్చరికలూ, సవాళ్ళూ చేసినా; ఆచరణకొచ్చేటప్పటికి భీరువు అయింది. అందుకే పారిపోవాలని ప్రయత్నించింది. ఆమె ఎవరి కంటబడకుండా పారిపోవాలనుకున్నప్పుడు, ధైర్యంగా గదిలో వున్న మరో మనిషి ముందు హత్య చేయదు కదా? ఆలోచించండి."

"అయితే ఏం చేసింది?"

"గది పక్కన మెట్లున్నాయి. అక్కడ చాటుగా నిలబడి కత్తి విసిరి వుంటుంది. ఆ తర్వాత పరుగు తీసింది."

చర్చ ఇలా సాగుతోండగా గంట తర్వాత ఫోన్ మోగింది.

అవతల జాన్ పలికాడు: "హలో లాల్, అక్కడ కృష్ణన్ వున్నాడా?"

"ఉన్నాడు.... దేనికి?"

"వెంటనే మీరిద్దరూ బయలుదేరి వచ్చేయండి."

"ఎక్కడికి?"

జాన్ అడ్రసుతోబాటు గబగబా కొన్ని సూచనలిచ్చాడు.

10

వాళ్ళు ముగ్గురు చప్పుడు గాకుండా పెరటి తలుపుల గుండా లోని కెళ్ళారు.

"ఆమె బెడ్‌రూమ్‌లో వుంది, బాగా తాగేసింది...." అన్నాడు జాన్ ముందుకు దారి తీసి, కిచెన్ తలుపు తెరుస్తూ.

లాల్, అతను వెనుక కృష్ణన్ అనుసరించారు.

జాన్ గుసగుసలాడాడు: "అవతల మరో గది వుంది. దానవతల బెడ్‌రూం వుంది.... మధ్య తలుపు అవతల నుంచి గొళ్ళెం పెట్టివుంది. అక్కడికి వెళ్ళాలి.... కాస్సే పట్లో అతనొచ్చేస్తాడు. రండి, అడుగులు జాగ్రత్త!"

నిశ్శబ్దంగా ముగ్గురూ ఆ గదిలో కెళ్ళి తలుపు దగ్గర నిలబడ్డారు. అవతల ఏమీ విన్పించలేదు. లాల్ కృష్ణన్ జాన్ ముఖం చూశారు ప్రశ్నార్థకంగా. జాన్ నోరు తెర వొద్దని వారించాడు.

ముగ్గురూ కొన్ని నిమిషాలు కాచుకున్నారు. కృష్ణన్‌కీ, లాల్‌కూ అసహనం ఎక్కువవుతోంది.... ఏమీ జరగటం లేదు. జాన్‌ని దీనంగా చూశారు.

అప్పుడే బయట తలుపు కొట్టిన చప్పుడయింది.

ముగ్గురూ వులిక్కిపడ్డారు.

మరోసారి చప్పుడయ్యాక అరుపు విన్పించింది. "నీల!"

అది మగ గొంతు.

"అతనొచ్చేశాడు!" జాన్ అన్నాడు చెవులు రిక్కిస్తూ.

మళ్ళీ తలుపు చప్పుడూ అరుపూ విన్పించాయి. బెడ్ రూమ్‌లో అలికిడైంది. చిన్న మూల్గు.... ఏదో కిందపడ్డ శబ్దం.

"ఎ....ఎ....యెవరది?" మెత్తగా పలికింది స్త్రీ కంఠం.

"నువ్వు తలుపు తీయ్!" అర్చింది బయటి కంఠం.

మళ్ళీ కొన్ని క్షణాలు నిశ్శబ్దం. ఆ తర్వాత చెప్పులు తొడుక్కుంటున్న సవ్వడి, నడుస్తున్న అలికిడి, తలుపుకి కొట్టుకున్న తాకిడి....

అప్పుడు తలుపు తెరుచుకున్న శబ్దం.

ఆ వెంటనే స్త్రీ కంఠం, "నువ్వా! ఇక్కడికెందుకొచ్చావ్?" అనర్చింది.

మగ కంఠం "నువ్వెందుకు పిలిచావ్?" అంది.

"నేనెప్పుడు పిలిచాను?" అడిగింది స్త్రీ కంఠం గాభరాగా.

"ఏడ్చావ్! ఒళ్ళు తెలియకుండా తాగేసి! ముందు పద లోపలికి!"

తలుపు ధడాలున మూసుకుంది. స్త్రీ కంఠం కేక పెట్టింది. భూమి కంపించేలా బరువయిన అడుగులు బెడ్ రూమ్‌లో కొచ్చాయి—వాటితో పాటు ఈడ్చుకు రాబడుతున్న స్త్రీ అరుపులు.

బెడ్‌రూంలో ఒక్కసారిగా పెద్ద పెట్టున చప్పుళ్ళు ప్రారంభమయ్యాయి.

"ఏమిటి .... ఏమిటిది....ఏయ్ః! .... నువ్వేం చేస్తున్నావ్? నన్నొదులు!" అరుస్తోందామె, "నన్నొదులు!.... నిన్నే! అబ్బా....నిన్నే! నిన్నే రాస్కెల్! వదిలిపెట్టు! ఓ—" చిన్న కేక వెలువడింది, "దుర్మార్గుడా! వెళ్ళిక్కడ్నుంచి! నిన్ను—నిన్ను—"

మగ కంఠం కెవ్వుమని కేక పెట్టింది.

"రాక్షసీ! నా చెయ్యి కొరికావు!"

"రాస్కెల్! నీ గొంతు నరుకుతాను. ఇక్కడికెందుకొచ్చావ్? నే నెప్పుడు రమ్మన్నాను? గెటవుట్! నా వొంటిమీద చేతులేయడానికెంత ధైర్యంరా నీకు."

"ఊరుకో బుజ్జీ. నీకు ఒళ్ళు తెలియడంలేదు. నే నెవర్ననుకున్నావు? నాతో ఏం చెప్పావప్పుడు? నీ మాట విని నేనా పని చేశాను. నాకో అవకాశం ఇస్తానని ఒప్పుకోకపోతే నేనా పని ఎందుకు చేస్తాను చెప్పు? నువ్వు చెప్పింది చేశాను, ఇప్పుడు తప్పించుకోలేవు. కమాన్!"

మళ్ళీ చప్పుళ్ళు ప్రారంభమయ్యాయి. ఇవతల ముగ్గురూ అసహనంగా నిలబడ్డారు.

"వెధవా! నిన్ను చంపమని అన్నానా? ఆ పని ఆమె చేస్తుందీ, పారిపోకుండా పట్టుకోమన్నాను! నామీద నీ ఆలోచనల్ని ఎప్పుడో పసిగట్టాను. నిన్ను పూరించి నా పబ్బం గడుపుకోడానికే అలా ఒప్పుకున్నాను. నీ దరిద్రపు చేతులు నన్ను తాకడం కలలో కూడా సహించను. డబ్బిస్తాను, ఎంత కావాలో అడుగు."

"నువ్వలా మోసగించలేవు బుజ్జీ. నీకోసం నువ్వు చెప్పిన దానికంటే ఎక్కువే చేశాను. అది ఆమెవల్ల అయివుండేది కాదు. మాట ఇచ్చి నువ్వు తప్పించుకోలేవు...."

"దూరంగా వుండు. అరుస్తాను. మందిని పిలుస్తాను-"

"ఈ అరుపులకంటేనా. కమాన్, మందు బిగించి మతిలేకుండా మాట్లాడుతున్నావ్."

ఈసారి అలజడిస్థాయి పెరిగింది. ఏవో క్రింద పడ్తున్నాయి, దొర్లుతున్నాయి. మూల్గులు.... కేకలు....

జాన్, కృష్ణన్‌కి సైగ చేశాడు. కృష్ణన్ వెనక్కి జరిగి

విసురుగా భుజంతో తలుపుని తోశాన్నాడు. వంతుల వారీగా ముగ్గురూ తోశాన్నారు.

గొళ్ళెం వూడి భళ్ళున తెరుచుకుంది తలుపు.

ముగ్గురూ లోనికి జొరబడ్డారు.

నీలతో పెనుగులాడుతోన్న రూంబాయ్ నాగేష్ బెదిరి పోయి, ఆమెని వదలి దూరంగా దూకేశాడు. నీల భయం కరంగా కేక పెట్టింది.

"అరెస్ట్ దెమ్!" అన్నాడు జాన్, కృష్ణన్‌తో.

11

అనిత అయోమయంగా, కలవరంగా చూసింది: "చెప్పరేం? ఎలా జరిగింది! నమ్మలేకపోతున్నాను."

జాన్ నవ్వాడు: "నేనూ నమ్మలేదు, మీ చెల్లెలి మాటల్ని. ఆమె గొప్ప త్యాగం చేస్తున్నాననుకొని అబద్దాలాడింది. కాని ఆమె నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించాలో నాకు బోధపడలేదు కేసులో మరికొన్ని విష యాలు బయటపడేవరకూ. పూర్ లిటిల్ థింగ్; ఎలాగూ పట్టుబడింది కనుక గత్యంతరంలేక అన్ని నిందలూ తనమీదే వేసుకుంది ఆత్మాభిమానంతో, బాహాటంగా హెచ్చరికలూ, ప్రతిజ్ఞలూ చేసినందువల్ల.

"అసలు మీ చెల్లెల్ని, మిస్ అనిత, ఆ అఘాయిత్యానికి పాల్పడేలోపు లాల్ చెప్పినట్లు ట్రాప్ చెయ్యాలనుకున్నాను గానీ, నాథ్ అంగీకరించలేదు. అసలు నన్ను బాడీగార్డుగా పిలవటమే గొప్ప సాహసమట! బయట మీ చెల్లెలు అతని గుండెలో ఎలా పడక వేసిందో, అలాగే ఆఫీసులో మరో ఇద్దరు అతని పీకలమీద కూర్చుని వున్నారు: నీల, రజని. మీ సహోద్యోగినులు.

"నీలకు ఇదంతా తెలియదనుకుని అతను పొరబడ్డాడు.

ఆమెకంతా తెలుసు. ఎక్కడో వున్న నాథ్ పార్టనర్ కే తెలియగా లేనిది ఆఫీసులో వున్న ఆమెకెలా తెలియకుండా వుంటుంది? మీ కేం జరిగిందో అంతా తెలుసామెకి. అయితే అది తెలిసి చావాలనుకోలేదు మునపటిలా. అతనితో పోట్లాడనూ లేదు. ఆమె గుండెలో పగ రగిలింది. దాన్ని నిశ్శబ్దంగా అణిచిపెట్టింది. తన్ని మళ్ళీ మళ్ళీ మోసం చేస్తున్న నాథ్ కి తగిన శాస్తి జరపాలనుకుంది. అతను చచ్చిపోవాలని, కసిగా నిర్ణయించుకుంది. అతనితో తన పెళ్ళి కల్ల."

"ఏం చేసింది? అతన్నెలా...."

"ఆమె నిర్ణయానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. మీ చెల్లెలు నాథ్ ని కనిపెట్టోందని ఆమెకి తెలుసు___"

"ఎలా తెలుసు?"

"చెప్తాను ఆగండి. నాథ్ క్షమాపణ చెప్పకోడని కూడా ఆమెకి తెలుసు గనుక మీ చెల్లెలు అతన్ని చంపడము ఖాయమని నమ్మకంగా తెలుసు. రాగిణి పారిపోయి కనిపెడ్తోందని నాథ్ కు ఫోన్ చేసి లాల్ మాట్లాడుతున్నప్పుడు అతనికి నాథ్ మాటలు సరిగా విన్పించలేదు.... గట్టిగా మాట్లాడమని నాథ్ కు పదేపదే చెప్పాడు. కానీ ఆ హడావిడిలో అసలు సంగతి లాల్ పసిగట్టలేదు. నేనూ పట్టించుకోలేదు. కానీ ఈ మధ్యాహ్నం పోస్టుమార్టమ్ లో హత్యలో ఇద్దరి పాత్ర వుందని తెలిసినప్పుడు-నా మెదడులో ఓ మెరుపు మెరిసింది___"

"ఏమిటది?"

"హత్యలో ఇద్దరి పాత్ర తెలిశాక నీలకున్న మోటివ్, అవకాశం ఆలోచించినప్పుడు; దాని బీజం ఎక్కడ వుందో

తెలిసిపోయింది! నిన్నటి లాల్ — నాథ్‌ల ఫోన్ సంభాషణ అనుకోకుండా జ్ఞాపకమొచ్చింది. లాల్‌కు అవతలి మాటలు నార్మల్ స్థాయిలో వినిపించని కారణం అప్పుడు పసిగట్టాను. అవతల శబ్దాలేవీ లేవు. నాథ్ అఫీసు చాలా ప్రశాంత వాతావరణంలో వుంది. అందువల్ల అలా స్పీచ్‌లో రావడం అవతల ఎవరో ఎక్స్‌టెన్షన్ ఎత్తడం వల్లేనని గ్రహించాను."

"అవును, ఆఫీసులో ఎక్స్‌టెన్షన్ వుంది."

"దటీజ్ రైట్. నీల ఎక్స్‌టెన్షన్‌లో ఆ మాటలు విన్నది. అప్పుడు రాగిణి గురించి తెలుసుకుంది.

"ఆఫీసునుంచి సాయంత్రం తిన్నగా హోటల్‌కెళ్ళింది. అక్కడ తాను వెళ్ళడంలోని మోటివ్‌ని మరుగుపర్చడానికి, తన రాక అరథంతంగా కన్పించేలా స్నానం అదీ చేసి ముస్తాబయింది. అప్పుడు 'మామూలు'గా నాథ్‌కు ఫోన్ చేసి ఆశ్చర్యపర్చింది. అప్‌సెట్ చేసింది. రమ్మని ఆజ్ఞాపించింది.

"సరిగ్గా ఆమె అనుకున్నట్టుగానే నాథ్ నన్ను వదిలించుకుని వెళ్ళాడు. అంతే, అప్పుడంతా చకచకా జరిగిపోయింది....అలా వచ్చే నాథ్‌ని ఆమె అనుకున్న ప్రకారం రాగిణి దార్లోనే చంపాలి. కానీ ఏ కారణంవల్లనైనా అవకాశం లేక అది జరక్కపోవచ్చు. హోటలు గదివరకూ ఆమె వెంటాడిరావచ్చు. అప్పుడెంత తెలివిగా చంపుతుందో ఎవరికి తెలుసు? ఆ నేరం తనమీదకే రావచ్చు. ఈ భయంతో, అనుమానంతో ఆమె రూంబాయ్‌ని ఎన్నుకుంది.

"ఈ రూంబాయ్‌కి ఆమె పైన చాలారోజులుగా ఆలోచనలున్నాయి....ఆమె పరిస్థితి వివరించి సహాయం కోరిన వెంటనే తన షరతుకూడా చెప్పి ఆమెని ఒప్పించాడు.

కానీ ఉదయం నాకిచ్చిన సాక్ష్యం సంగతి లక్ష్యపెట్ట లేదు. ఆమె ఆ మరతు నిజంగా ఒప్పుకోలేదు. అలా నటించి అతన్ని పురికొల్పింది.

"ఒకవేళ రాగిణి నాథ్‌ని పొడిచి పారిపోతే, అప్పుడామె రెడ్‌హాండెడ్‌గా పట్టుబడితేనే తన కిలాడీ హాలీ, చిక్కులూ నిశ్చయంగా వుండవని ఆమె ఆలోచన.

"అలాగే రాగిణి ఆ గదివరకూ అనుసరించింది. బయట బెల్ నొక్కి మెట్లదగ్గర వెళ్ళి దాక్కుంది. అది చివరి అంతస్తు. చాలావరకు గదులు ఖాళీగా వున్నాయి. ఒకానొక గదిలో ఈ నాగేష్ వుండి, గమనిస్తున్నాడు. నాథ్ ఎప్పుడైతే తలుపు తెరిచి బయటకొచ్చాడో, రాగిణి గురి చూసి కత్తి విసిరింది. బహుశా మొన్నసాయంత్రం అతని బలం తెలిసి, దగ్గరికెళ్ళి పొడిస్తే అప్పటిలాగే విఫలమవుతుందనుకుని వుంటుంది—అలా విసిరేసి అక్కడనుంచి పరుగుతీసింది."

"అప్పుడు?"

"అది చూసిన నాగేష్ గాభరాచెందాడు. ఆ కత్తి గుండెలో దిగబడలేదు. జారి కిందపడింది — నాథ్ బూటులో గుచ్చుకుంది. అలా జరగడం నాగేష్‌కు నచ్చలేదు. నాథ్ ప్రాణాలు పణంగా నీల ఒప్పుకున్న మరతు గల్లంతవుతుందనుకున్నాడు. అలా జరగడం భరించలేదు. ఆ అవకాశాన్ని అదృష్టాన్ని ససేమిరా వదులుకోడు. అందుకే తెగించి ముందుకొచ్చి, కత్తిని వేలిముద్రలు చెడకుండా కర్చీఫ్‌తో ఎత్తి నవ్వుతూనే పొడిచేశాడు— రాగిణి చేసిన గాయంలోకి-బలంగా లోతుగా. వెంటనే అక్కడనుంచి పరుగుతీసి రాగిణిని పట్టుకున్నాడు."

"వాడు! వాడెంతటి దుర్మార్గుడు."

"దుర్మార్గులకి దయ వుండదు. అలా జరిగి వుండవచ్చని వూహించాక మధ్యాహ్నం నీల ఇంటికి రహస్యంగా వెళ్ళాను. ఆమె బాగా తాగేసి పడుకుని వుంది. అదే సమయమనుకున్నాను నా అనుమానం తీర్చుకోడానికి. వెంటనే నాగేష్‌కు ఫోన్ చేసి, నా ఫ్రెండ్ సోనియాతో తాగిన గొంతుకతో నీలలా మాట్లాడించి, ఆమె ఇంటికి రప్పించాను. అంతే, వాళ్ళిద్దరు నేననుకున్నట్టుగానే నోళ్ళు పారేసుకుని సంకెళ్ళు తగిలించుకున్నారు."

"పాటిల్ గురించి చెప్పండి. అత నేం చేశాడు?"

జాన్ నవ్వాడు: "ఏమీ చేయలేదు. అతనికి కంపెనీ ప్రతిష్ట గురించి బెంగ ఎక్కువ. నాథ్‌ని రెడ్ హేండెడ్‌గా పట్టుకోవాలన్న ఉబలాటంతో హోటలు కెళ్ళాడు. రిసెప్షన్‌లోనే తటపటాయిస్తూ వున్నాడు. ఇంతలో హత్య గురించి విని ఉబలాటం ఎగిరిపోయి అక్కడనుంచి ఉడాయించాడు. పైగా ఆఫీసుకొచ్చి మమ్మల్ని దబాయించాడు. వెల్, లాల్ శుభ్రంగా వాష్ చేసి పంపాడు. నిజంగా తనే హత్య చేశాడేమోనన్న భ్రమ కల్గించి వదిలాడు."

అనిత భారంగా నిట్టూర్చింది: "మరి రాగిణి.... ఆమెనెలా.... ఆమె నేం చేస్తారు?"

"అంతా జడ్జీ దయాదాక్షిణ్యాలపైన వుంది. హత్యా ప్రయత్నంమీద స్వల్పంగా శిక్షించవచ్చు లేదా ఆమె మనోస్థితికి, జాలితలిస్తే క్షమించి వదిలేయనూవచ్చు.... మీరేమీ బెంగపడకండి. అసలు గండం తప్పింది."

"దాని సాహసబుద్ధీ, మొండిపట్టుదల వల్లనే ఇదంతా జరిగింది. నాథ్‌కా దుర్గతి పట్టిందంటే నాకు నిజంగా-"

"ఓ.కే! ఓ.కే! ఇంక బాధపడకండి. లాల్ మిమ్మల్ని స్థితిలో చూడలేనన్నాడు. ఓదార్చి—కుదుటపర్చి రమ్మన్నాడు. స్త్రీ లెవరైనా బాధపడితే అతను చూడలేడు. గజగజ వణికిపోతాడు" అన్నాడు జాన్.

"ఆనందంగా వుంటే కొయ్యబారిపోతాడా!" అంది అనిత బలవంతాన నవ్వు తెచ్చుకుంటూ.

—: ఐపోయింది :—